ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 30 అక్టోబరు 2024 | 7





మనకూ ఉన్నాయ్.. శివకాశీలు!

- ఉమ్మడి జిల్లాలో బాణసంచా తయారీ
- ప్రతి జిల్లాలోనూ ప్రధాన కేంద్రాలు
- ఏడాదంతా వేలాది మందికి ఉపాధి
- శివకాశీని తలదన్నే ఉత్పత్తులు

బాణసంచా అంటే ప్రతి ఒక్కరి నోటా వినిపించే మాట శివకాశీ.. ఎందుకంటే అక్కడ మందు గుండు సామగ్రి నాణ్యతగా ఉంటుందనేది ప్రతి ఒక్కరి మాట.. నేటికీ శివకాశీ మాట వినిపించకుండా దీపావళి పండుగ జరగదు.. బాణసంచా అంటే శివకాశీ ఒకటే కాదండోయ్.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ అటువంటి ప్రాంతాలు జిల్లాకో పది వరకూ ఉంటాయి.. అవెక్కడో ఉన్నాయనుకుంటున్నారా.. ఒక్కసారి బాణసంచా తయారు చేసే ప్రధాన ప్రాంతాలేంటో తెలుసుకుంటే.. ఇక్కడా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం.. రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం, జువ్విపాడు ఇలా చెప్పుకుంటూ పోతే బాణసంచా తయారీనే ఉపాధిగా మలుచుకున్న గ్రామాలెన్నో ఉన్నాయి. ఒక పక్కన ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా.. దశాబ్దాలుగా వేలాది మందికి అదే ఉపాధి.. అధికారికంగా తయారీ కేంద్రాల లెక్క పదుల సంఖ్యలో ఉంటే.. అనధికారికంగా ఈ లెక్క వందల్లో ఉంటుందనేది అధికారులెరిగిన సత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆనందమైనా.. బాధయినా.. ఉత్సవమైనా.. జాతరైనా.. రాజకీయ మీటింగ్ అయినా చివరికి పుట్టినరోజు అయినా కూడా మందుగుండు సందడి చేయాల్సిందే మరి.. అందుకే ఏడాదంతా మూడు బాంబులు.. ఆరు చిచ్చుబుడ్లుగా ఈ వ్యాపారం సాగుతూనే ఉంటుంది.. రేపు దీపావళి పండుగ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తయారీ కేంద్రాలపై ప్రత్యేక కథనం.. - వివరాలు 8లో





మద్యం అక్రమాలపై డయల్ 70932 73981
కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. నూతన మద్యం పాలసీ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మద్యం ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయించడం, బెల్టు షాపులను నిర్వహించడం వంటివి చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. సారాకు సంబంధించి ఇప్పటి వరకూ 25 చోట్ల సోదాలు చేసి 24 మందిపై కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేశామన్నారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 11,800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేశారన్నారు. 23 మందిని అరెస్టు చేసి 43.39 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్టు చెప్పారు. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలో మంగురువారం రాత్రి ఎక్సైజ్ అధికారులు దాడిచేసి 6 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు ఎక్సయిజ్ సీఐ జి. సత్యనారాయణ తెలిపారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో ఒక వ్యక్తిని అరెస్టుచేసి 6 క్వార్టర్ ఆఫీసర్స్ చాయిస్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకసారి కేసు నమోదైన తర్వాత భవిష్యత్తులో పునరావృతమైతే మరింత కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అక్రమాలపై ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 70932 73981కి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

రైసుమిల్లుల్లో సోదాలు

నిడదవోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం సూరాపురం గ్రామంలోని అలివేలు ఆగ్రో రైస్ మిల్లుపై మంగళవారం సాయంత్రం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు చేపట్టారు. రాత్రి వరకు తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై వివరాలు వెల్లడించేందుకు మరింత సమయం పడుతుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష తగదు
డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు

రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సమస్యలపై మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లకు రాజ్యాంగం, సుప్రీం కోర్టు ద్వారా కల్పించిన హక్కులను వివరించారు. వాటిని వినియోగించుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. స్వయం ఉపాధి కోసం పలు పథకాలు అమల్లో ఉన్నాయన్నారు. ఈ విషయంలో సహాయం చేయడానికి డీఎల్ఎస్ఏ సిద్ధంగా ఉందన్నారు.

గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీరుగా పుల్లారావు
ఎస్ఈగా నరసింహమూర్తి

రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీరుగా ఎస్.పుల్లారావు నియమితులయ్యారు. ఆయన ధవళేశ్వరంలోని క్వాలిటీ కంట్రోలు ఆంధ్రా రీజియన్ అండ్ ఏపీఈఆర్ఎల్ సీఈగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ధవళేశ్వరంలోని పీఐపీ హెడ్‌వర్క్స్ సర్కిల్ ఎస్ఈగా కె.నరసింహమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు పలువురు అభినందనలు తెలిపారు.

డబ్బులిచ్చుకో.. దుకాణం పెట్టుకో!



చోటా నేతలు.. పండుగ మామూళ్లు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): దీపావళి వచ్చిందంటే అందరికీ పండుగే. ప్రతి ఏడాది అధికారులకు మరీ పండుగ. ఈ ఏడాది కూటమి చోటా నాయకులు చేరినట్టు సమాచారం.. మామూళ్లు మాకే ఇవ్వండి.. మేం చూసుకుంటాం అంటూ దుకాణదారులకు హుకుం జారీ చేసినట్టు తెలిసింది. దీంతో దీపావళి బాణ సంచా దుకాణాల ఏర్పాటులో కూడా కొంత మంది కూటమి నాయకులు చక్రం తిప్పుతున్నారు.గత ఐదేళ్లగా ఇటువంటి పనులకు దూరంగా ఉన్న చోటా మోటా నాయకులు అధికారంలోకి వచ్చాక వసూళ్లు మొదలేట్టేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజవర్గాల పరిధిలోను ఇదే పరిస్థితి ఉంది. మండల హెడ్ క్వార్టర్స్‌లో బాణసంచా దుకాణాలకు పోలీస్, అగ్నిమాపక శాఖ, స్థానిక సంస్థల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. సాధా రణంగా వ్యాపారులు ఆయా శాఖలకు దరఖాస్తులు చేసుకుని చలానాలు కట్టి అనుమతులు తీసుకుంటారు. అయితే గత ప్రభుత్వం పుణ్య మా అంటూ అన్ని వ్యవహారాల్లో కొత్త పోకడ ఆరంభమైంది. షాపుల అనుమతులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు డీల్ చేయడం వ్యాపారుల తరపున అనుమతులకు అధికారులను అప్రోచ్ కావడం అలవాటు చేశారు. ఇప్పుడు ఈ సంస్కృతి కూటమి నాయకులకు అంటుకుంది. ఫలితంగా బాణసంచా దుకాణాలకు కూడా కొన్ని నియోజకవర్గాల్లో డబ్బులు భారీగానే వసూలు చేసినట్టు తెలిసింది. దుకాణాన్ని బట్టి మామూలు కట్టేశారు. రూ.10 వేల నుంచి రూ.45 వేల వరకు వ్యాపారుల నుంచి వసూలు చేసినట్టు తెలిసింది. ఇందులో అనుమతులు జారీ చేసే అధికారులకు భాగస్వామ్యం ఉన్నట్టు వినికిడి.దీపావళికి మూడు రోజుల ముందు నుంచి వ్యాపారం చేసేవారు ప్రజల డిమాండ్‌ను బట్టి ధరలు పెంచుతారు. ఈ వ్యాపారం జిల్లాలో కోట్లలో జరుగుతుంది. అందుకే భారీ షాపుల అనుమతులకు డబ్బుకు లెక్కచేయరు. అయితే పరోక్షంగా ఈ భారమంతా వినియోగదారులపై పడుతుంది. జిల్లాలో రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం , అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజవర్గాల్లో కూటమి క్షేత్రస్థాయి నాయకులు బాణ సంచా అనుమతుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పలు నియోజకవర్గాలో క్షేత్రస్థాయిలో వసూళ్లకు పాల్పడిన నాయకులను ఎమ్మెల్యేలు మందలించినట్టు తెలిసింది.

- బాణసంచా దుకాణానికో రేటు
- రూ.10 వేల నుంచి రూ.45 వేలు
- అన్నీ చూసుకుంటామని హామీ
- ముందుగానే చెల్లింపులు
- జిల్లాలో 388 షాపులకు అనుమతి
- ఒక్క రాజమండ్రిలోనే 144
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- ధరలపై బాదుడే..బాదుడు

ధరల బాదుడే..

రాజమహేంద్రవరం/పెరవలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా ధరలు పేలుతున్నాయ్.. అన్నీ ధరలు పెరిగినట్టే బాణసంచా ధరలూ పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్టు సమాచారం. బాణసంచాను కాల్చడానికి పిల్లలు, పెద్దలు పోటీ పడుతుంటారు. దీంతో ప్రతి ఏడాది డిమాండ్ ఉంటుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా దుకాణాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో అధికారికంగా 388 దుకాణాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 263, కొవ్వూరు డివిజన్‌లో 125 దుకా ణాలకు అనుమతిచ్చారు. ఒక్క రాజమహేంద్రవరంలోనే 144 దుకాణాలు ఉన్నాయి.ఆయా దుకాణాల్లో ధరలు మాత్రం ఢాం..ఢాం అని పేలు తున్నాయి.ధరలపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారం పెంచి విక్రయాలు చేస్తున్నారు. దీపావళి బాణసంచాలో రూపాయి నుంచి రూ. 20 వేల వరకు మందుగుండు సామగ్రి ఉంది. గురువారమే దీపావళి కావడంతో మంగళవారం కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడాయి. బుధవరం మరింత వ్యాపారం జరిగే అవకాశం ఉంది. గురువారం ఉదయం కొనుగోలు చేస్తారు. ఈ లెక్కన మరో రెండు రోజులు వ్యాపారం ఉంటుంది.

బాణసంచా పవర్ పెరిగింది

నేను 2001 నుంచి రాజానగరం మండలం రాధేయపాలెంలో గొడౌన్ పెట్టి, హోల్‌సేల్ బాణ సంచా వ్యాపారం చేస్తున్నా. ఆరంభంలో బాణ సంచాకు పవర్ తక్కువ ఉండేది. ఇటీవల పవర్ బాగా పెంచారు. ఇవాళ మందులను ఎండ బెట్టనవసరం లేదు. ప్రతి ఏడాది కోట్లలో వ్యాపా రం సాగుతోంది.

- మామిడిపల్లి రామకృష్ణ, వ్యాపారి





పోలీసుల తనికీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి) : బాణసంచా దుకాణాల్లో నిబంధనలపై ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలోని బాణసంచా విక్రయ దుకాణాలు, తయారీ, నిల్వ కేంద్రాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. డీఎస్పీలు రంగంలోకి దిగి అనుమతులు పరిశీలించారు. అగ్నిమాపక ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.



ఆసుపత్రిలో నవీన్‌కుమార్‌ను పరామర్శిస్తున్న పురందేశ్వరి

రైలు నుంచి జారిపడిన యువకుడికి ఎంపీ పరామర్శ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి తీవ్రగాయాలపాలైన యువకుడికి మెరుగైన చికిత్స అందించాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. విశాఖపట్నం ఆరిలోవకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడి కుమారుడు నవీన్‌కుమార్ ఇటీవల రైలు నుంచి జారిపడి తీవ్రగా యాలపాలయ్యాడు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో తలకు బలమైన దెబ్బ తగలడంతో కాళ్ల చేతులు చచ్చుపడిపోయాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి మంగళవారం ఆ యువకుడిని పరామర్శించారు.మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి సహాయం కోసం ముఖ్యమంత్రికి, ఆరోగ్యశాఖ మంత్రికి లేఖను పంపించారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య
కాకినాడలో ఘటన

9

నిరక్షరాస్యులు 5087

- ఆరు మండలాల్లో ఇదీ లెక్క
- మహిళా అక్షరాస్యతపై దృష్టి
- 'ఉల్లాస్'కు కూటమి శ్రీకారం
- ఐదు విభాగాలపై అవగాహన
- రాజానగరంలో తొలి శిక్షణ
- ఆరుగురు ఎంపీడీవోల హాజరు
- త్వరలో తరగతులు ఆరంభం

రాజానగరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు..ఈ నానుడి అందరికీ సుపరిచితమే. దీనిలో భాగంగానే ఆడపిల్లలు చదువుకోవాల్సిన ఆవశ్యకత గురించి మన పూర్వీకులు ఎప్పుడో చెప్పారు. ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి పేర్కొన్నారు.జిల్లాలో తొలిసారిగా ఉల్లాస్ మొదటి ఫేజ్ శిక్షణ తరగతులను రాజానగరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహిం చారు. ఆరు మండలాలకు చెందిన ఎంపీ డీవోలు హాజరయ్యారు.పీడీ మాట్లాడుతూ గ్రామీణ పేద రిక నిర్మూలన సంస్థ (సెర్ప్)తో పాటు వయోజన విద్య విభాగం సమన్వయంతో పనిచేస్తాయన్నా రు.చదువులేని మహిళల్లో అక్షరా స్యతపై చైత న్యం పెంపొందించేలా కేంద్ర ప్రభు త్వం ఆధ్వ ర్యంలో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్ర మానికి రూపకల్పన చేసిందన్నారు. మొదటి ఫేజ్ శిక్షణ తరగతులు అనంతరం సెకండ్, థర్డ్ ఫేజ్ శిక్షణ తరగతులను జిల్లా అంతటా నిర్వహించ డం జరుగుతుందన్నారు. జిల్లాలో రాజానగరం, రంగంపేట, బిక్కవోలు,నిడదవోలు, పెరవలి, చాగల్లు మండలాల్లో సుమారు 5,087 మంది నిర క్షరాస్యులైన వయో జనులు ఉన్నట్టుగా గుర్తించా మన్నారు. వీరందరికి ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై 200 గంటల పాటు శిక్షణ ఇచ్చి మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందన్నారు. వీరికి విద్యనేర్పించేందుకు వలంటీర్లుగా ఇంటర్ పైబడిన చదివిన వారిని నియమిస్తామన్నారు. వీరికి నవంబరు నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు.

అమలు ఇలా...

జాతీయ విద్యా విధానం 2020 పాలసీకి అనుగుణంగా అమలు చేస్తున్నారు. ఐదు విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ప్రతి గ్రామం నుంచి నిరక్ష్యరాస్యులైన మహిళలు అక్షరాలు నేర్చుకోవడం, సంతకాలు చేయడం, మొబైల్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ అక్షరాస్యతపై తర్ఫీదు ఇస్తారు. గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలను అక్షరాస్యత కేంద్రాలుగా తీర్చిదిద్దుతారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు పసుపులేటి పోశయ్య, రాష్ట్ర స్థాయి రీసోర్స్ పర్సన్లు రవీంద్రబాబు, బండారు రామకృష్ణ, ఆయా మండలాల సెర్ప్ ఏపీఎంలు గుమ్మడి సునీత,సీసీలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ ఇతర అధికారులు

అస్సాగో సమస్య తీరుస్తాం
గుమ్మళ్లదొడ్డి ప్రజలకు కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ హామీ

గోకవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి ఎదురయ్యే ఇబ్బందులను అరికడతా మని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. గుమ్మళ్లదొడ్డి గ్రామాన్ని మంగళవారం కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. అనంతరం గ్రామంలోని రామాలయం వద్ద కమిటీ సభ్యుల సమక్షంలో స్థానికులతో చర్చించారు. పరిశ్రమ నుంచి వాసనలు హానికరమైనవి కావని యాజమాన్యం వివరిస్తున్న విషయాన్ని బాధితులు వారు దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళల్లో కంపెనీ నుంచి వచ్చే శబ్దాలకు నిద్ర పట్టడం లేదని, నల్లటి మసి లాంటి బూడిద తమ నివాస గృహలపై పడుతుందని పలువురు కలెక్టర్‌కు తెలిపారు. గ్రామస్థులు చెప్పినదంతా విన్న కలెక్టర్ మరోమారు గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటానన్నారు. వారి వెంట ఆర్డీవో కృష్ణనాయక్,కోరుకొండ సీఐ సత్యకిషోర్, తహశీల్దార్ సాయి ప్రసాద్, కాలుష్య నివారణ మండలి సభ్యులు ఉన్నారు.

రాజకీయం చేయవద్దు : జ్యోతుల

అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి తన నియోజకవర్గంలోని ప్రజలను ఎలా పరిరక్షించుకోవాలో తనకు తెలుసని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గాజింగం సత్తిబాబు నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ వివాదాన్ని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కమిటీ వేసి చర్యలు తీసుకుంటామన్నారు. కొంత మంది నాయకులు రాజకీయ స్వలాభం కోసం దీక్షలకు దిగడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇథనాల్ పరిశ్రమ నుంచి స్థానికులకు ఎటువంటి సమస్య ఎదురవ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.మల్లిసాల గ్రామంలో 225 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌కు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగబోతుందన్నారు.

జీజీహెచ్‌లో దళారులను అరికట్టాలి
సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల సంఘం వినతి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సరాకుల సుధాకర్, కందుకూరి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో దళారుల బెడద తీవ్రంగా ఉందని, సదరం ఇతర సేవల పేరుతో రోగులను మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారన్నారు. ఇలాంటి వారిని సిబ్బంది ప్రశ్నిస్తే వారిపై దళారులు దాడులకు దిగుతున్నారని, దుర్భాషలాడుతున్నారన్నారు. మరికొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ ఓపీ కౌంటర్‌లో రాత్రి వేళ పనిచేసే సిబ్బందికి అల్లరి మూకల కారణంగా రక్షణ లేకుండా పోతున్నదన్నారు. ఆసుపత్రి పోలీస్ అవుట్‌పోస్టులో సమర్థులైన సిబ్బందిని నియమించేలా పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించాలని కోరారు. వీటిపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు.



సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల వినతి

సూపరింటెండెంట్‌ను కలసిన వారిలో ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, మణికంఠ, రమణ తదితరులున్నారు.



గోదావరి పుష్కరాలకు సమాయత్తం కండి
2027లో నిర్వహణ ఏర్పాట్లపై తొలి సమీక్ష

8





మనకూ ఉన్నాయ్.. శివకాశీలు!



కొమరిపాలెంలో తయారుచేసిన సెర్పిలైట్లు



వెలుగు జిలుగుల రంగేళి.. దీపావళి. దివ్వెల పండుగంటే చిన్నాపెద్దా అందరికీ ఆనందమే. ముఖ్యంగా పిల్లలకు ఒక అద్భుత లోకాన్నే వీక్షిస్తున్నట్టు విరజిమ్మే బాణసంచా వెలుగులంటే చెప్పలేనంత సంతోషం. గతంలో బాణసంచా కావాలంటే ఎవరి ఇంటి దగ్గర వాళ్లే సొంతంగా తయారుచేసుకునేవారు. సిసింద్రీలు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, పటాసులు, నారబాంబులు ఇళ్ల వద్దే నెలరోజుల ముందు నుంచే తయారుచేసేవారు. మిగిలిన బాణసంచా మాత్రం స్థానిక వ్యాపారులు తయారుచేసి అమ్మేవారు. తర్వాత శివకాశీ నుంచి బాణసంచా దిగుమతులు పెరిగాయి. బ్రాండింగ్ పేరుతో అది రెట్టింపు అయింది. అయినప్పటికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో బాణసంచా తయారుచేసే కేంద్రాల్లో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి సిద్ధమవుతోంది. స్థానికంగా తయారుచేసే వీటిని ఇతర ప్రాంతాలకూ ఎగుమతి చేస్తున్నారు. ఏడాది పొడవునా చూస్తే ఈ వ్యాపారం కోట్లలోనే సాగుతోంది. ఇందులో దశాబ్దాల తరబడి బాణసంచా తయారీలో పేరొందిన గ్రామాలున్నాయి. ప్రాణాపాయం ఉన్నప్పటికీ ఇదే జీవనాధారంగా చేసుకున్న వందలాది మంది కార్మికులు ఉన్నారు. మన ప్రాంతంలో బాణసంచా తయారీ సంస్థలపై ప్రత్యేక కథనం.

దీపావళేకాదు.. మరెన్నో సంబరాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని పలు గ్రామాలు బాణసంచా తయారీలో ప్రసిద్ధి చెందాయి. అందులో ప్రధానమైనవి బిక్కవోలు మండలం కొమరిపాలెం, సామర్లకోట మండలం వేట్లపాలెం, రామచంద్రపురం మండలం ద్రాక్షారామ, జువ్విపాడు.. ఇలా పది గ్రామాల వరకు బాణసంచా తయారీ జరుగుతుంది. దాదాపు ఐదు దశాబ్దాల నుంచి ఇదే పరిశ్రమలో కొనసాగుతున్నవారు ఉన్నారు. వందలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కేవలం దీపావళి కోసమే కాకుండా జాతరలు, ఉత్సవాల సందర్భంలో మందుగుండు కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా జరుగుతాయి. ఈ మందుగుండు కాల్పుల విషయంలో పోటీలు కూడా పెడతారు. అలాగే వివాహాలు, ఇతర కార్యక్రమాలు, రాజకీయ వేడుకల్లో కూడా మందుగుండు కాల్చడం మన ప్రాంతంలో ఆనవాయితీగా ఉంది. దీంతో ఇక్కడ బాణసంచా పరిశ్రమ కొనసాగడానికి ప్రధాన కారణమని చెప్పాలి.

ఓ వెలుగు వెలిగి..

(ఆంధ్రజ్యోతి- మండపేట/యు.కొత్తపల్లి)

మందుగుండు సామగ్రి తయారీలో మండపేట కూడా ప్రసిద్ధి. ఇక్కడ తయారయ్యే బాణసంచా రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతులు జరిగేవి. తర్వాత వరుస ప్రమాదాల్లో తయారీదారులు మృతి చెందడంతో ఇక్కడ తయారీ కనుమరుగైపోయింది. టీడీపీ నిర్వహించే మహానాడు సభల సందర్భంగా ప్రారంభ వేడుకల్లో మండపేట నుంచి వెళ్లే మందుగుండు కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. మాజీ ఎమ్మెల్యేలు దివంగత వీవీఎస్ఎస్ చౌదరి, వల్లూరి నారాయణరావులు ఈ కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో జరిగేలా చూసుకునేవారు. పట్టణంలో మొత్తం ఆరు కుటుంబాలు మందుగుండు తయారుచేసేవారు. ఇందులో అన్నవరపు కోటేశ్వరరావుకు చెందిన నాలుగు కుటుంబాలు అగ్ని ప్రమాదాల్లో మరణించగా, మిగిలిన రెండు కుటుంబాలూ మందుగుండు తయారీ మానేశారు. అలాగే కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో పదేళ్ల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో 18 మంది మృతి చెందడంతో అక్కడ తయారీ ఆగిపోయింది. పెదపూడి, అమలాపురంలలో కూడా ప్రమాదాలతో తయారీ నిలిచిపోయింది.

బాణసంచాకు కేరాఫ్ అడ్రస్ కొమరిపాలెం, బిక్కవోలు

(ఆంధ్రజ్యోతి-బిక్కవోలు)

దీపావళి బాణసంచాకు తూర్పుగోదావరి జిల్లా కొమరిపాలెం, బిక్కవోలు గ్రామాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. కొమరిపాలెం గ్రామంలో 1932లో వెలుగుబంట్ల వీరన్న బాణసంచా తయారీ ప్రారంభించగా, ఆయన కుమారులు సత్యనారాయణమూర్తి, రామకృష్ణలు వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రస్తుతం శ్రీగణపతి ఫైర్ వర్క్స్ పేరిట వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి తన కుమారుడు చిట్టిబాబుతో కలసి బాణసంచా తయారీ పరిశ్రమను కొనసాగిస్తున్నారు. ఇక్కడ శివకాశీ మాదిరిగా డిస్కో చిచ్చుబుడ్లు, టపాసులు, మతాబులు, బేబీ కాండెల్స్, పెన్సిళ్లు, తాళ్లు, పేల్పు జువ్వలు, బ్యాటరీ బాక్సులు, ఔట్లు, సెర్పిలైట్లు, రాకెట్లు తయారు చేస్తారు. అలాగే పండుగలకు, వివిధ ఫంక్షన్లలో కాల్చే ఈతచెట్టు, మల్లెపందిరి, నాగసర్పం, చైనావీల్, రన్నింగ్ వీల్, కలర్‌డైమండ్ వీల్, స్వస్తిక్‌వీల్, పెద్ద సెర్పిలైట్లు, జపాన్‌రింగు, మద్రాసు ఔట్లు తయారు చేస్తారు. వీరు తయారుచేసిన బాణసంచాను అప్పట్లో 1952లో మద్రాసులో జరిగిన ఏఐసీసీ సమావేశంలోను, 1978లో బెంగళూరులో జరిగిన జాతీయక్రీడల్లోను, 1983లో ఎన్టీఆర్ ప్రమాణస్వీకారానికి, 1983, 1999లలో హైదరాబాద్‌లో జరిగిన ఫిలిం ఫెస్టివల్స్‌కు, పలు చలన చిత్రాల శతదినోత్సవ వేడుకలకు కాల్చి కొమరిపాలెం ఖ్యాతిని చాటారు. 1999లో శిల్పారామంలో నిర్వహించిన బాణసంచా పోటీల్లో కొమరిపాలెం బాణసంచాకు ప్రథమస్థానం పొందడంతో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్యనారాయణమూర్తి సత్కారం పొందారు. అలాగే కొమరిపాలెంతోపాటు బిక్కవోలులోని శ్రీగోలింగేశ్వరా ఫైర్ వర్క్స్‌ను ఆకాలంలోనే కొప్పిశెట్టి సూర్యనారాయణ ప్రారంభించగా ఆపై ఆయన కుమారుడు సత్యనారాయణ కొనసాగించగా, ఆయన మనుమడు శ్రీనివాస్ నిర్వహిస్తూ బిక్కవోలు బాణసంచా ఖ్యాతిని నిలిపారు. ఇంకా బిక్కవోలులో కనకదుర్గ హుస్సేనియా ఫైర్‌వర్క్స్ పేరిట బాణసంచా తయారు చేస్తున్నారు. కొమరిపాలెంలో వెలుగుబంట్ల వారి వద్ద శిక్షణ పొందిన వేల్పూరి సత్తిబాబు, నూకారెడ్డిలు 30 ఏళ్ల నుంచి భవానీ గ్రాండ్ ఫైర్స్ పేరిట బాణసంచా తయారు చేస్తున్నారు.



బిక్కవోలులో తయారు చేస్తున్న పేల్పు జువ్వలు

ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలి

తాము ప్రమాదమని తెల్సినా అందరికీ ఆనందం కల్గించేందుకు ఏళ్ల తరబడి బాణసంచా తయారుచేస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాం. మా వద్ద నేర్చుకున్న 80 మంది ఆరు జిల్లాల్లో సొంతంగా బాణసంచా తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మా వద్ద 20 కుటుంబాల వారు పనిచేస్తున్నారు. వీరికి ఏటా ఇన్సూరెన్స్ కూడా చెల్లిస్తున్నాం. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలన్నీ చేపట్టాం. గంధకం, సూరేకారం, బీడు, అల్యూమినియం పౌడర్‌ను రూర్కెలా, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుని వాడతాం. తమిళనాడు రాష్ట్రంలో బాణసంచా తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నారు. ఇక్కడ కూడా పరిశ్రమగా గుర్తించి సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలి.



- వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫైర్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

శివకాశి టు యానాం. ఏటా రూ. 8 కోట్ల వ్యాపారం



యానాంలో వ్యాపారి నాగేశ్వరరావు

(ఆంధ్రజ్యోతి-యానాం)

కేంద్రపాలిత ప్రాంతం యానాంలో తయారీ పరిశ్రమ లేదుకానీ ఏటా ఉభయగోదావరి జిల్లాల స్థాయిలో ఏటా రూ.8 కోట్ల నుంచి పది కోట్ల వరకు బాణసంచా అమ్మకాలు సాగుతాయి. ఇక్కడి వ్యాపారులు నేరుగా శివకాశి నుంచి మందుగుండు సామగ్రిని ప్రత్యేక వాహనాల్లో తీసుకువస్తారు. యానాంలో అనునిత్యం దొరికే 7 హోల్‌సేల్ షాపుల్లో విక్రయాలు సాగిస్తారు. వీటితోపాటు దీపావళికి వారం ముందే మరో 21 షాపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. నేరుగా తీసుకురావడం వల్ల తక్కువకే వెరైటీలన్నీ లభిస్తాయి. ప్రసుత్తం పిల్లలతోపాటు పెద్దలను ఆకట్టుకునేందుకు రిటైల్ వ్యాపారస్తులు ఫ్యాన్సీ ఐటమ్స్‌పై మోజు చూపిస్తున్నారని, ఆ వెరైటీలు ఈసారి ఎక్కువగా వెళతున్నాయని బాణసంచా వ్యాపారి నాగేశ్వరరావు చెప్పారు.

రెండో శివకాశీ.. వేట్లపాలెం

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)

దీపావళి బాణసంచా తయారీలో రెండో శివకాశీగా పేరొందిన గ్రామం వేట్లపాలెం. ఇది సామర్లకోట మండలంలో ఉంది. ఇదే మండలంలోని హుస్సేనుపురం, జి మేడపాడు గ్రామాల్లో కూడా పెద్దఎత్తున బాణసంచా తయారయ్యేది. ఏటా రూ.5 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతూ 500 మంది కూలీలకు ప్రత్యక్షంగానూ, మరో వెయ్యి మందికి పరోక్షంగానూ బాణసంచా తయారీ ద్వారా ఉపాధి లభించేది. అయితే 2019 సెప్టెంబరు 30న జి. మేడపాడు కెనాల్ రోడ్డులోని ఒక బాణసంచా తయారీ సంస్థలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు మృతి చెందారు. దాంతో ఆ గ్రామంలో బాణసంచా తయారీ మూతపడింది. కొవిడ్ తర్వాత, వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఆంక్షల వల్ల సామర్లకోట మండలంలో ఈ వ్యాపారం కాస్త తగ్గిందనే చెప్పాలి. కానీ ఈ ఏడాది మళ్లీ భారీగా బాణసంచా తయారీ జరుగుతోంది. వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో సుమారు ఏడు దశాబ్దాలుగా బాణసంచా తయారీచేస్తూ విక్రయాలు చేయడమేగాకుండా అంతకుమించి శివకాశి బాణసంచా సరుకులను కూడా ఈ ప్రాంత వ్యాపారులు దిగుమతులు చేసుకుంటూ ఏటా కోట్లలోనే లావాదేవీలు సాగిస్తుంటారు. వేట్లపాలెం, హుస్సేన్‌పురంలలో తయారయ్యే బాణసంచాలో చిచ్చుబుడ్లు, సెర్పిలైట్లు పేరొందాయి. మిగిలిన రకాల్లో మిడతల దండు, రాకెట్లు, చిటపటలు ప్రసిద్ధి. ఇక పలు పెళ్లిళ్లకూ, ఇతర వేడుకలకు ఇక్కడ తయారుచేసే బాణసంచాలో పందిరిమంచం, ఈతచెట్టు, రన్నింగ్‌బాల్, పాము బుసలు తదితర కలర్స్ రాకెట్లకు గిరాకీ ఎక్కువ.



వేట్లపాలెంలో టపాసుల తయారీ దృశ్యం

తరతరాలుగా బాణసంచా తయారీలో ద్రాక్షారామ, జువ్విపాడు

(ఆంధ్రజ్యోతి-ద్రాక్షారామ)

ద్రాక్షారామ కేంద్రంగా పెద్దిరెడ్డి వంశీకులు మూడు తరాలుగా బాణసంచా తయారీలో కొనసాగుతున్నారు. 1940లో మద్రాస్ లైసెన్సుతో పెద్దిరెడ్డి సుబ్బారావు మందుగుండు తయారీ ప్రారంభించారు. తదుపరి ఆయన కుమారులు పెద్దిరెడ్డి వీర్రాజు కాకినాడలో, పెద్దిరెడ్డి రాంబాబు, సూరిబాబులు ద్రాక్షారామలో బాణసంచా తయారీ చేపట్టారు. ద్రాక్షారామలో పెద్దిరెడ్డి సూరిబాబు ఆంజనేయ ఫైర్‌వర్క్సు స్థాపించి బాణసంచా తయారీలో పేరుప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. ద్రాక్షారామలో కార్తీక దీపారాధన మహోత్సవంలో పెద్దిరెడ్డి సూరిబాబు బాణసంచా కాల్పులు చూసేందుకే వేలాదిమంది జనం ఎగబడేవారు. ప్రస్తుతం మూడో తరం వారసులు బాణసంచా తయారీని కొనసాగిస్తున్నారు. పెద్దిరెడ్డి వీర్రాజు అనంతరం వారసులు పెద్దిరెడ్డి సత్తిబాబు తూరంగి, పెద్దిరెడ్డి సూరిబాబు మృతి చెందడంతో ఆయన అల్లుడు దవులూరి వెంకట్రాజు అలియాస్ శ్రీను, పెద్దిరెడ్డి రాంబాబు కుమారుడు పెద్దిరెడ్డి సూబ్బారావు తాళ్లపొలంలో బాణసంచా తయారీ చేస్తున్నారు. తారాజువ్వలు, రాకెట్లు, విజిల్‌రాకెట్లు, బెలూన్ రాకెట్లు, ఆకాశదీపాలు, విజిల్ షాట్స్, బేబీ క్యాండిల్స్, మిడతల దండు, చిచ్చుబుడ్లు, డిస్కోబుడ్లు, బ్యాటరీ బ్యాక్సు దండ్లు, గొట్టం ఔట్లు, కలర్‌పెన్సిల్లు, సెర్పిలైట్లు, ఈతచెట్లు, మల్లి పందిరి, నాగస్వర్పం, చైనారింగు, జపాన్ రింగు, రన్నింగ్ బాల్, డైమండ్ వీల్ వంటివి ఇక్కడ తయారీకి ప్రసిద్ధి. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.



జువ్వలు తయారు చేస్తున్న పెద్దిరెడ్డి సుబ్బారావు

జువ్విపాడు.. పేరు

రామచంద్రపురం మండలంలోని ఓదూరు పంచాయతీ శివారు జువ్విపాడు అనే గ్రామం ఉంది. జిల్లేళ్ల ఆనందరావు ఈ గ్రామంలో బాణసంచా తయారీ ప్రారంభించారు. తదుపరి కొన్నేళ్లకు వెంకట్రావు త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు పేరుతో బాణసంచా తయారీ కేంద్రం ప్రారంభించారు. త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు స్థాపనతో జువ్విపాడు బాణసంచా తయారీకి పేరెన్నికగా మారింది. దీపావళితో పాటు ముఖ్యంగా తిరునాళ్ల, జాతరలు, పండుగలకు త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు బాణసంచా మారుపేరుగా నిలిచింది. త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు బాధ్యతలు వినకోటి శ్రీనివాస్ చేపట్టిన అనంతరం ఉభయగోదావరి జిల్లాల్లో జాతరలు, తిరునాళ్లలో త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు పాల్గొని పలు బహుమతులు సొంతం చేసుకుంది. ఇలా బాణసంచా తయారీదారులు జువ్విపాడు ఊరిపేరు సార్థకం చేశారు.



ఆంజనేయ ఫైర్‌వర్క్సు యజమాని దవులూరి



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం,

ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా చక్రస్నానం

- ముగిసిన బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం
- మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణం, స్వామివారి ఏకాంత సేవ
- ముగింపు ఉత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు

ఆత్రేయపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిదవ రోజు మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజావహరోణంతో బ్రహ్మండనాయకుని బ్రహ్మోత్సవం ఘనంగా ముగిసింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడిని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరి బ్రహ్మోత్సవ పూజలు అందుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు- కనకదుర్గ దంపతులు నిర్వహించారు. సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేళతాళ మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని పల్లకిలో అశేష భక్తజన గోవిందనామస్మరణ నడుమ గౌతమి గోదావరి వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మహాఆశీర్వచనము నిర్వహించారు. ధ్వజావరోహణంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. రాత్రి స్వామివారి అద్దాల మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో ఏకాంత సేవ జరిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం- మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారులు ప్రదర్శనలు విద్యుత్, పుష్పాల అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తన్మయత్వం పొందారు.



స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు



పూల ఊయలలో స్వామివారికి ఏకాంత సేవ దృశ్యం



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు దంపతులు

నేడు యథావిధిగా ఆర్జిత సేవలు

బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు బుధవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు ఉపకమీషనరు చక్రధరరావు తెలిపారు. నోము ఆచరించిన భక్తులు ఆన్‌లైన్ స్లాట్ విధానంలో టిక్కెట్లు బుక్‌చేసుకుని అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు తదితర ఆర్జిత సేవలు నిర్వహించుకోవాలని ఈవో కోరారు.

పుష్కరాలకు సన్నద్ధమవుదాం

- 2027 గోదావరి పుష్కరాలపై సమీక్ష
- గత అనుభవాలే పాఠాలుగా..
- జిల్లాను యూనిట్‌గా తీసుకుని ప్రణాళిక
- రహదారుల విస్తరణ, ఘాట్ల అభివృద్ధి
- సీతానగరంవైపు వీఐపీ ఘాట్ల నిర్మాణం
- తొలి సమన్వయ సమావేశంలో రాష్ట్ర మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలో పుష్కరాలపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, ముప్పిడి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28: గత అనుభవాలనే పాఠాలుగా చేసుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా 2027 అఖండ గోదావరి పుష్కరాలను నిర్వహిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం 2027 అఖండ గోదావరి పుష్కరాల సమన్వయ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అఖండ గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. అఖండ గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని సమర్థవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకువెళదామన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు అఖండ గోదావరి పుష్కరాలకు వస్తారనే అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అఖండ గోదావరిలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యం వస్తుందనే విషయం భక్తులకు తెలియజేయాలన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ అఖండగోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు తదితర మౌలిక వసతులు, నూతనంగా మరికొన్ని ఘాట్లకు ప్రతిపాదనలు, టెంపుల్ టూరిజంపై దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ పుష్కరాలకు సంబంధించి వీఐపీ ఘాట్లను సీతానగరంవైపు నిర్మించాలన్నారు. గోదావరి వ్యూ అద్భుతంగా ఉండే ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు.కడియం నర్సరీ ప్రాంతాల్లో అతిథిగృహాలు, మౌలిక సదుపాయాలు, సమగ్రప్రాతిపదికన అభివృద్ధికి ప్రతిపాదన చేయాలన్నారు. రహదారుల విస్తరణ పనులు జరగాలని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 26స్నానాలరేవులు ఉన్నాయన్నారు. విజ్జేశ్వరం నుంచి పట్టిసీమ వరకు 13 ఘాట్లు ఉన్నట్టు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల పేరు చెబితే సీతానగరం మండలంలో గుర్తుకు వచ్చేది మునికూడలి ఘాట్ అన్నారు. దానికి గతంలో చంద్రబాబు దేవాన్ష్ ఘాట్‌గా నామకరణ చేశారని తెలిపారు. ఈ రేవును ఆధునీకరించాలన్నారు. సీతానగరంలో 8 రేవులు ఉన్నట్టు తెలిపారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ మాట్లాడుతూ అఖండ గోదావరి పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తుల రద్దీకి తగ్గట్టుగా విడివిడిగా మార్గాలు ప్రతిపాదిస్తున్నామన్నారు. భక్తుల వసతి కోసం శాటిలైట్ సిటీ, బస్టాండ్ పార్కింగ్ స్థలం గుర్తించాం, సీసీ కెమెరాలు, ప్రవేశ నిర్గమ ద్వారాలు, లోకల్ ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై ఆయా శాఖలతో చర్చలు జరుపుతాం.కమిషనర్ కేతన్‌గార్గ్ తొలుత పుష్కరాలపై ఏవి ప్రదర్శన చేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తన డివిజన్ పరిధిలోని కొవ్వూరు నుంచి నిడదవోలు వరకు గోదావరి రేవుల పరిస్థితిని వివరించారు. గతంలో పార్కిం గ్‌కు భూములు ఇచ్చిన రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో ఇప్పుడు రైతులు ముందుకు రావడంలేదన్నారు. అయినా వారితో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. లక్ష్మీనగర్ లేఅవుట్‌లో ఉన్న స్థలాన్ని పార్కింగ్‌కు వినియోగించవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ సీతానగరం నుంచి కడియం వరకు ఉన్న రేవుల పరిస్థితిని వివరించారు. నూతనరేవుల నిర్మాణాలకు అనుగుణంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నా రు. టూరిజం ఆర్డీ స్వామినాయుడు మాట్లాడుతూ టూరిజం పరంగా ప్రణాళికతో ముందుకు వస్తామన్నారు. రెండో సమావేశం నాటికి తాము మరిన్ని ప్రణాళికలతో వస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీలు దేవకుమార్, భవ్యకిషోర్, ఆర్ఎంసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శాంతి కల్యాణం

అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం బహుళద్వాదశిని పురస్కరించుకుని స్వామి-అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, అర్చకులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్యామ్‌కుమార్‌కు ఎంపిక పత్రం ఇస్తున్న వీసీ మురళీకృష్ణ

అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు పరిశీలకునిగా శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో బుధవారం నుంచి నవంబరు 3వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ పోటీలకు పరిశీలకునిగా జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐయూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్యామ్‌కుమార్‌ను ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించి యూనివర్శిటీకి మంచి పేరు తీసుకురావాలని వీసీ ఆకాంక్షించారు.



తుని డిపోలో డ్రైవర్ లోవరాజు

రైట్ రైట్... మళ్లీ విధుల్లోకి లోవరాజు

తుని రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ లోవరాజు మంగళవారం ఉదయం విధుల్లో చేరాడు. నాలుగు రోజుల కిందట బస్సు ముందు డ్యాన్స్ చేయడంతో ఆయన్ను విధుల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ చొరవ చూపడంతో అధికారులు తిరిగి విధులు అప్పగించారు. దీంతో లోవరాజు మంగళవారం ఉదయం తుని-కాకినాడ బస్సు ఎక్కి ఉత్సాహంగా బాధ్యతలు స్వీకరించాడు.



అమ్మా... నాన్నా... మీరెక్కడ!

ఏడిద బాణసంచా పేలుడు ఘటనలో తండ్రి దుర్మరణం

తల్లి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం

బంధువుల సంరక్షణలో చిన్నారి మోక్షిత్

మండపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ పాలబుగ్గల చిన్నారి తల్లి పిలుపు కోసం, నాన్న లాలన కోసం అమాయకంగా ఎదురు చూస్తున్నాడు. వారు ఏమయ్యారో కూడా తెలియని పసి వయసు. ఎవరు ఎత్తుకుంటే వారి వద్దే ఉంటున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో సోమవారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో కల్లి వెంకటకృష్ణ మృతి చెందిన సంగతి తెలిసిందే. అతడి భార్య జయశ్రీ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతోంది. వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. వెంకటకృష్ణ-జయశ్రీ తమ కుమారుడు మోక్షిత్‌కు ఇటీవలే మొదటి పుట్టినరోజు జరిపారు. పేలుడు సమయంలో పక్కింటి వద్ద అడుకుంటుండటంతో ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడ్డాడు. ముద్దులొలుకుతున్న ఆ పసివాడిని వెంకటకృష్ణ బంధువులు, చుట్టుపక్కల వారు లాలిస్తున్నారు. బోర్లు కొడుతూ జీవనం సాగించే వెంకటకృష్ణ మృతితో అతడి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇదే ప్రమాదంలో గాయపడ్డ వెంకటకృష్ణ తల్లిదండ్రులు కోలుకుంటున్నారు.



ఇన్వర్టర్ బ్యాటరీ పేలుడు కూడా కారణమే

తేల్చిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం

ఏడిదలో బాణసంచా పేలుడు ఘటనపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా విజయవాడ నుంచి ముగ్గురు నిపుణులతో కూడిన ఫోరెన్సిక్ బృందం వచ్చింది. ఇంటిని పరిశీలించి ప్రమాద ఘటనకు కారణాలపై ఆరా తీశారు. బాణసంచా తయారీకి సల్ఫర్, పొటాష్, గంధకం, బొగ్గు వినియోగించినట్టు గుర్తించారు. పేలుడు తీవ్రత ఎంత మేర జరిగింది, భవనం కూలేంతగా మందుగుండు ఏ మేరకు వాడారో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటిలో ఇన్వర్టర్ బ్యాటరీ లీకవ్వడం, అందులోని రసాయన పదార్థాలు పేలడం కూడా ప్రమాదానికి కారణంగా గుర్తించారు. ప్రమాదం జరిగినప్పటి నుంచీ రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, మండపేట రూరల్ ఎస్ఐ సురేష్, మండపేట అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



గో వధకు...

- కొత్తపల్లి అడ్డాగా పశువుల తరలింపు
- వారంలో మూడుసార్లు రవాణా
- ముగ్గురు వ్యక్తుల సిండికేట్
- తద్వారా లక్షలాది రూపాయల అర్జన



చింతూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొంతమంది కఠినాత్ములు ఒక సిండికేట్‌గా ఏర్పడ్డారు. గో వధ కోసం పశువులను అమ్ముతూ లక్షలు ఆర్జించడం మొదలుపెట్టారు. వీరి దందా కారణంగా వందల సంఖ్యలో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. వ్యాన్లు, కంటైనర్లలో కిక్కిరిసి తరలించడం వారు ఎంచుకున్న మార్గం. అందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కొత్తపల్లిని అడ్డాగా ఎంచుకున్నారు. వీరికి పశువులను సరఫరా చేసేందుకు సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాలో మరో ముఠా ఉంది. ఒడిశాలో ఊరూరా తిరిగి పశువులను కొనుగోలు చేయడం ఆ ముఠా వంతు. తర్వాత వాటిని సీలేరు నదిపై నాటు పడవల్లో దాటించి కొత్తపల్లి చేరుస్తున్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు కంటైనర్లు, వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇలా తరలించేందుకు చింతూరు (ఎర్రంపేట)కు చెందిన ఓ వ్యక్తితో పాటు గోకవరం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, ఒడిశాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. వీరంతా గోవధతో కొద్ది కాలంగా లక్షలు ఆర్జిస్తున్నారు. ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో రాత్రివేళ ఈ తరలింపు ప్రక్రియ యథేచ్ఛగా సాగుతోంది. దందా ఎవరి కంటా పడకుండా ఆ ముఠా జాగ్రత్త పడుతుంది. ఇందులో భాగంగా తులసిపాకల, ఎర్రగొండపాకల పరిసర అటవీ ప్రాంతంలో వందల సంఖ్యలో పశువులను కట్టేస్తున్నారు. అనంతరం రహస్య ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకున్న ర్యాంపుల వద్దకు వాహనాలు చేరుకుంటాయి. అప్పటివరకు రోజుల తరబడి పశువులు నీరు, మేత లేకుండా అల్లాడిపోతుంటాయి. దీంతో కొన్ని పశువులు అక్కడే మృత్యువాతపడుతున్నాయి. అంతేకాదు వ్యాన్లలో ఎక్కించే సమయంలో మొరాయించిన పశువుల కాళ్లు విరగ్గొట్టి పడేస్తారు. ఇదంతా నిత్యం సాగుతున్న బహిరంగ దందా. పశువులు దాచి ఉంచిన రహస్య ప్రదేశాల వద్దకు ఇతరులెవ్వరు వెళ్లినా వేగుల ద్వారా ఆ సమాచారం ఆ ముఠాకు ఇట్టే చేరుతుంది. పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే విధిగా నియమ నిబంధనలు పాటించాల్సి ఉంది.

ఈ విషయంలో ఆ ముఠా తమ తెలివి తేటలను ప్రదర్శిస్తుంది. పోలీసు చెక్‌పోస్టులు దాటే వరకు పశువులను కాలినడకన తరలించడం అందులో ఒక భాగం. అనంతరం జనసంచారం లేని ప్రదేశాల్లో వ్యాన్లు, కంటైనర్లలో ఎక్కించి తరలించి సొమ్ములు చేసుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. మరికొన్ని పశువులను కూనవరం వద్ద గోదావరిలో పడవలపై దాటించి రుద్రంకోట చేరుస్తున్నారు. ఇదంతా అర్ధరాత్రి సమయంలోనే. దాదాపు 50 మంది దాకా ఈ పనులన్నీ చక్కపెడతారు.





ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎర్రగొండపాకల-తులసిపాకల మధ్య, కూనవరం వద్ద గోదావరి ఒడ్డున గోవులను సిద్ధం చేసిన దృశ్యం





బాలురు సింగిల్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో విజేతలు వీరే

కాకినాడ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. వివిధ జిల్లాల క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మంగళవారం పోటీలను రాష్ట్ర పరిశీలకుడు ఎస్.వెంకటసుబ్బయ్య, ఎస్కే బాబు, టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌కుమార్ పరిశీలించారు. వి.రవిరాజు, కె.నూకరాజు, కౌర్, జి.సునీల్‌కుమార్, కె.పరశురాం పాల్గొన్నారు.

బాలుర సింగిల్స్...

అండర్-19 విభాగంలో ఎన్.హేమంత్‌సాయి (శ్రీకాకుళం), సీహెచ్ నవీన్ (చిత్తూరు), బి.కరుణ (చిత్తూరు), ఆర్.విశాల్ (రాజమహేంద్రవరం), ఎస్.దివ్యేశ్ (విశాఖ). షాయిఖ్ అబూ బాఖట్ సిద్ధిక్ (చిత్తూరు), ఎం.రేవంత్(కృష్ణా), ఎం.సూర్యతేజస్విని (కృష్ణా), ఎస్కే అబ్బర్ అహమ్మద్ (గుంటూరు), వై.తేజిత్ (గుంటూరు), ఎస్.చరణ్‌కుమార్ (గుంటూరు), కె.అభిషేక్‌కుమార్ (తూర్పు గోదావరి), పి.రోహిత్‌చంద్ (గుంటూరు), పి.వీవన్‌గౌతమ్ (గుంటూరు), రిషి కరుణ (తూర్పు గోదవరి)

అండర్-14 విభాగంలో

ఎస్కే మహ్మమద్ హర్షద్ (చిత్తూరు), కె.శ్రీకృష్ణ (శ్రీకాకుళం), ఎస్ఏఆర్ ప్రభాస్‌రెడ్డి (కర్నూలు), వై.మహంత్‌నీలేష్‌రెడ్డి (కర్నూలు), టి.వెంకటసాయిఅరుష్ (గుంటూరు), యు. సాయిశౌర్య (కృష్ణా), జి.నిఖిలేష్ (తూర్పు గోదావరి), వై.హరీష్ (కృష్ణా), వై.నీరజ్‌రెడ్డి (గుంటూరు), కె.నిశాంత్ (కర్నూలు), బి.పవన్ సాయి (విజయనగరం), ఎస్.ఈశ్వర్‌హితేష్ (కృష్ణా), దుర్గాశ్రీఅఖిల్ (పశ్చిమ గోదావరి), ఎన్.ధీరజ్ (అనంతపురం), ఎన్.నాగచరణ్ (తూర్పు గోదావరి) పవన్‌కుమార్‌యశరాజ్ (చిత్తూరు), బి.ధాత్రేష్ (విశాఖ), ఎస్‌టీఎస్‌టీ సుభాష్ (తూర్పుగోదావరి), వై.ఈశాన్ (తూర్పు గోదావరి), ఎ.వీరన్ (విశాఖ)

బాలికల సింగిల్స్ అండర్-14 విభాగంలో

పి.సేవిత (విశాఖ), ఎస్కే ఆనమ్ హబాబ్ (అనంతపురం), పీవీ శుక్తిశ్రీ (గుంటూరు), డి.ఆరీఫా (అనంతపురం), ఎన్.తనిష్కారెడ్డి (గుంటూరు), జి.శ్రీవేద (తూర్పు గోదావరి), పి.వేదశ్రీ (శ్రీకాకుళం).



అండర్-14,17 విభాగాల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీలు అందుకున్న క్రీడాకారులు

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలు

మలికిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ 68వ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం బహుమతులు అందజేశారు. బాలురు అండర్-17 విభాగంలో తూర్పు గోదావరి జిల్లా (ప్రథమ), విశాఖపట్నం జిల్లా (ద్వితీయ), అండర్-14 విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా (ప్రథమ), విశాఖపట్నం (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. బాలికలు అండర్-17 విభాగంలో కృష్ణా జిల్లా (ప్రథమ), అనంతపురం జిల్లా (ద్వితీయ), అండర్-14 విభాగంలో కృష్ణా జిల్లా (ప్రథమ), నెల్లూరు జిల్లా (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో శ్రీరామ అకాడమీ ఫౌండర్ దెందుకూరి రాంబాబురాజు, కార్యదర్శి అడబాల విజయశ్రీనివాస్, ఎం.సత్యరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పుష్కర కాలువలో పడి యువకుడి మృతి



గండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారికి చెందిన ఐనపాల ధర్మరాజు (30) గ్రామ శివారున పెద్ద చెరువు దగ్గరలోని పొలానికి వెళ్లేందుకు సోమవారం రాత్రి పుష్కర కాలువ అక్విడెక్టు సైడ్‌వాల్ మీదుగా నడుచుకుంటూ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. విషయం తెలియగానే స్థానికులు వెతకగా మంగళవారం ఉదయం కాలువలో విగతజీవిగా దొరికాడు. గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేశారు.

త్రోబాల్, బాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య, క్రీడల పట్ల సమాన ఆసక్తి కనబరచాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పు గోదావరి స్థాయి అండర్-14, 17 బాలికల త్రోబాల్, బాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

ఇంట్లోంచి దుర్వాసన రావడంతో బయటపడ్డ వైనం

మూడు రోజులై ఉండొచ్చన్న పోలీసులు

కాకినాడ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తల్లి, కూతురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆకాశం స్వాతి (28), ఆమె తల్లి ఆకాశం సరస్వతి (60) 12 ఏళ్లుగా కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంకే వారి వీధిలో గుర్రాల శ్రీనివాస్‌కుచెందిన శ్రీదుర్గా నివాస్‌లో అద్దెకు ఉంటున్నారు. సరస్వతి పెద్ద కుమార్తె హారికకు వివాహమై విశాఖపట్నంలో ఉంటోంది. రెండో కుమార్తె స్వాతి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ తల్లిని పోషిస్తోంది. కొంత కాలంగా సరస్వతి మానసిక పరిస్థితి బాగా లేని కారణంగా తల్లి, కూతురు మధ్య మనస్పర్థలు వచ్చాయి.





ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి (పాత చిత్రం), మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ నాగదుర్గారావు

ఒకరిని విడిచి మరొకరు ఉండలేని ఆ తల్లీకూతుళ్లు తీవ్ర మనస్తాపానికి గురై చనిపోదామని నిర్ణయించుకుని చీరలతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం ఇంట్లోంచి దుర్వాసన వస్తుండడం గమనించిన గుర్రాల శ్రీనివాస్ కిటికీలను తెరిచి చూడగా తల్లి, కూతురు విగతజీవులుగా కనిపించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. స్వాతిని పెళ్లి చేసుకోమని తల్లి సరస్వతి తరచూ ఒత్తిడి తెస్తోందని... తల్లిని విడిచి ఉండలేక, పెళ్లంటే ఇష్టం లేక వారు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికులు చెప్తున్నారు. ఇది జరిగి సుమారు మూడు రోజులై ఉంటుందని సీఐ నాగదుర్గారావు వెల్లడించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విపత్తుల నిర్వహణ మేనేజర్ బదిలీ

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.లావణ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

కాంట్రాక్ట్ ఏఈ విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

అన్నవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వాటర్ వర్క్స్ విభాగం కాంట్రాక్ట్ ఏఈగా పని చేస్తున్న ఎం.గురవయ్యను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) వి.రామకృష్ణపై గురవయ్య అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడి కొట్టడానికి ప్లాస్టిక్ కుర్చీ ఎత్తాడు. అక్కడున్న డీఈ (ఎలక్ట్రికల్) వి.సత్యనారాయణ కలుగజేసుకుని అడ్డుకుని గురవయ్యను బయటకు పంపాడు. సహాయ కమిషనర్ కార్యాలయ అటెండరు, ఇతర సిబ్బంది సమక్షంలో ఈ ఘటన జరిగిందంటూ ఈఈ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. జరిగిన ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఏఈ గురవయ్య స్థానంలో తాత్కాలికంగా పి.విజయప్రసాద్‌బాబు (కాంట్రాక్ట్ ఏఈ)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్తిపాడులో 4న లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చన





కోటి బిల్వార్చన జరగనున్న మైదానం (పైన) అయ్యప్ప పడి పూజకు వేదిక (కుడి)



వివరాలు వెల్లడిస్తున్న చంటి స్వామి

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో నవంబరు 4న లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చనను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. 25వేల మంది అయ్యప్ప భక్తులతో జరిపేందుకు మినర్వా కళాశాల ఎదుట ఎనిమిది ఎకరాల సువిశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. రూ.80లక్షల నుంచి కోటి రూపాయల వరకు వ్యయం అయ్యే కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవంలను తిలకించడానికి రావాల్సిందిగా అయ్యప్ప స్వాములు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నారు. శబరిమల ఆలయ అర్చకుడు మేల్‌శాంతి, పందళ రాజవంశీయుడు నారాయణ వర్మ రానున్నట్టు అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ సభ్యుడు, గురుస్వామి చంటిస్వామి మంగళవారం విలేకరులకు తెలిపారు. లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం,పూర్ణాహుతి, దండపాణి గురువర్యుల గురుపూజోత్సవం జరుపుతామని చంటిస్వామి చెప్పారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో సత్తా

కాకినాడ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అండర్-17 విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటారు. అన్ని విభాగాల్లోనూ సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. విజేతలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి, డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాస కుమార్, డీఈవో పి.రమేష్ అభినందించారు.

ఆక్రమణల చెరలో ఏటిగట్టు

- తూర్పువైపు ఏటిగట్టు తవ్వేసి పక్కా భవనాల నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



ఏటిగట్టు తవ్వి పక్కా భవనం కడుతున్న దృశ్యం

సీతానగరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరి ఎడమ గట్టు ఆక్రమణలకు గురై బలహీన పడుతోంది. గోదావరి లెఫ్ట్ బ్యాంకు అధికారులు ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో రోజురోజుకు ఏటిగట్టు ఆక్రమణలకు గురవుతోంది. ఏటిగట్టుకు పడమర వైపు గోదావరి వైపు రక్షణ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటుచేసిన రక్షణ గట్టు దారిపొడవునా ఆక్రమణలు చోటు చేసుకోగా ప్రస్తుతం గట్టుకు తూర్పువైపు ఏటిగట్టు తవ్వేసి పక్కా భవనాలు కట్టుకుంటున్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం గ్రామాల్లో ఈ ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఏటిగట్టుపై ఆక్రమణలు తొలగించి గట్టు పటిష్టతను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం

కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి

కోరుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం బూరుగుపూడి గేటు వద్ద టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కూటమి బలపరిచిన ఉమ్మడి తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ రేపాడ చిరంజీవి రాజు పాల్గొని రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. అలాగు తాగునీటి సంఘాల, కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, కర్రి లక్ష్మీసరోజ, బదిరెడ్డి దొర, మేడిశెట్టి శివరాం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీపడకుండా మరమ్మతులు చేపట్టాలి

అనపర్తి కెనాల్ రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కెనాల్ రోడ్డు మరమ్మత్తుల విషయంలో అధికారులు, కాంట్రాక్టరు రాజీ పడకుండా పనులు నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి సూచించారు. వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం ఆయన అనపర్తిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గుంతల్లో మట్టిని శుభ్రం చేయకుండా కంకర నింపడాన్ని గుర్తించిన ఎమ్మెల్యే సిబ్బందిని ప్రశ్నించారు. ఇలా చేస్తే మరమ్మతులు చేస్తున్న ఫలితం ఉండదని ఇప్పటికే ఈ రోడ్డుపై ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే మరమ్మతుల విషయంలో కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కెనాల్ రోడ్డు పూర్తి స్థాయి నిర్మాణానికి సమయం పడుతున్నందున అప్పటి వరకు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా సుమారు రూ.6.33 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

నల్లమిల్లి మనోజ్ పుట్టినరోజు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పుట్టినరోజును ఎమ్మెల్యే నల్లమిల్లి నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య నిర్వహించారు. అనంతరం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పొలమూరులోని జరిగిన వేడుకల్లో మనోజ్ కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ధన్వంతరి జయంతి

జాతీయ ఆయుర్వేద దినోత్సవం



ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో భగవాన్ ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని మంగళవారం స్థానిక రామచంద్రరావు పేటలోని సంఘం సీనియర్ సభ్యుడు కేవీ సుబ్రహ్మణ్యం నివాసం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, పూజలు జరిపారు. అనంతరం జరిగిన సభలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆకాశం గౌరీష్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్యానికి ఆయుర్వేద ఆవిష్కరణలు అనే థీమ్‌తో 150 దేశాల్లో గ్లోబల్ ఈవెంట్ జరుపుకోవడం ఆయుర్వేద వైద్యరంగంలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యుడు కేవీ సుబ్రహ్మణ్యంను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి శెట్టి సత్యనారాయణ, రెడ్డి చంద్రశేఖర్, కలిశెట్టి సత్యనారాయణ, ఎం.శంకర్రావు, ఆదినారాయణ, సీఎం గోవిందరాజులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని శ్రీదేవినగర్ బీసీ కాలనీలో సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోదావరి జోన్ ధర్మప్రచారక్ జగన్నాథరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎ.మల్లేశ్వరరావు, యానాపు ఏసుబాబు, బి.అప్పారావు, బి.కిరణ్, నాగబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

జగన్..నీచుడు

- రాత్రికి కాలక్షేపం చేసినందుకే అప్పట్లో సీటు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28: మాజీ సీఎం జగన్ అంత నీచుడ్ని తన జీవితంలో వేరొకరిని చూడలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్న తల్లికి, చెల్లికి అన్యాయం చేయడమే కాకుండా వారిపైనే కేసులు పెట్టాడన్నారు. వైఎస్ఆర్ తనయుడిగానే అతని వెంట అప్పట్లో తాము పయనించామన్నారు. తన రాజకీయ భవిష్యత్తు కోసం సొంత బాబాయి హత్య చేయించాడన్నారు. గతంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల్లో తన భార్యకు మేయర్ సీటు ఫైనల్ చేసిన సమయంలో జగన్ రాజమహేంద్రవరం వచ్చారని అప్పట్లో రాత్రి ఒక మహిళ కాలక్షేపం చేయడంతో ఆమెను రాత్రికి రాత్రే మేయర్ అభ్యర్థిగా తెరమీదుకు తెచ్చాడన్నారు. వైసీపీలో కష్టపడిన తనలాంటి వారికి చాలా అన్యాయం చేశాడని మండిపడారు. సమావేశంలో డాక్టర్ వడయార్, పట్నాల శ్రీనివాసరావు, అబ్దుల్లా షరీఫ్, జాలా నటరాజ్, మోతా శారద పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

రాజానగరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అవి నీతి రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం, పౌరులు, ప్రైవేట్ రంగాలు సమష్టి బాధ్యతగా గుర్తించాలని ఓఎన్జీసీ సీజీఎం సోమశేఖర్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారత భవిష్యత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర వహించాలని, అవినీతి వ్యతిరేక పోరాటంలో కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు నైతిక విలువలతో నడుచుకోవాలన్నారు. మరో ముఖ్యఅతిథి ఓఎన్జీసీ సీజీఎం భాస్కర్ మాట్లాడుతూ అక్టోబరు 28 నుంచి నవంబరు 3వరకు నిర్వహించే ఓఎన్జీసీ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లో అవినీతి వ్యతిరేక స్ఫూర్తి కలిగించేందుకు వివిధ పోటీలు, చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడుతూ ప్రతిజ్ఞ చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీజీయూ డైరెక్టర్ పీఆర్‌కే రాజు, ఓఎన్జీసీ డీజీఎం ఎం.శ్రీనివాస్, గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఎస్ బాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆదిత్య బిజినెస్ స్కూల్లో దానవాయిపేట యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ వారు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులను బ్యాంక్ మేనేజర్ పి.రాజు, కస్టమర్ సర్వీస్ అసోసియేట్ ఎ.కిశోర్ అందజేశారు. చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణరెడ్డి, డైరెక్టర్ బీఈ వీఎల్ నాయుడు, ఎస్పీ గంగిరెడ్డి విజేతలను అభినందించారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆర్.సుభాష్ ఆధ్వర్యంలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అవినీతిలో మన దేశం 96వ స్థానంలో ఉందని, అవినీతి రహిత దేశంగా చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సువర్ణవేణి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ సీజీఎం సోమశేఖర్

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



రాజానగరం సదస్సులో మాట్లాడుతున్న సోమశేఖర్

భగవద్గీత ప్రచారం

కడియం, అక్టోబరు 29: దీపావళి పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ మంగళవారం పొట్టిలంకలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేపట్టారు. గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగమార్గం నడిపిస్తాడనడానికి గుర్తుగా దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలని వక్తలు చెప్పారు.

సువర్ణ భారతి ఉత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరి గట్టున శ్రీ శృంగేరీ శంకర మఠంలో శ్రీ సువర్ణ భారతి ఉత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన గురువందన సభలో జగద్గురువుల యోగ వైభవాన్ని శ్రీ శలాక రఘునాథ శర్మ వివరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ సభకు సారథ్యం వహిస్తూ శ్రీ భారతీ తీర్థ మహాస్వామి సన్యాసం స్వీకరించి నేటికి అర్ధ శతాబ్దం పూర్తయిందని సువర్ణభారతి ఉత్సవాల్లో భాగంగా వేద పఠనం, పాదుకా పూజ, హోమాధికాలు నిర్వహించినట్టు చెప్పారు. శంకర మఠం ధర్మాధికారి వేలూరి బాలాజీ దంపతులు జగద్గురువులకు పూజాధికాలు నిర్వహించి పండితులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, టీవీ నారాయణరావు, వేలూరి రామచంద్ర, కొండూరి సూర్యనారాయణ, మంధా శ్రీనివాసరావు, జి.సూరిబాబు, వి.తాతయ్య శాస్త్రి పాల్గొన్నారు.

రజక చైతన్య సంఘం రాష్ట్రాధ్యక్షుడిగా సీతారాముడు

ఎమ్మెల్యే బత్తులను కలిసిన కార్యవర్గం

కోరుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రజక చైతన్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంలో మంగళవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. రజక చైతన్య సంఘం రాష్ట్రాధ్యక్షుడిగా మాతా సీతారాముడు, మండల గౌరవాధ్యక్షుడిగా పెనుకొండ వెంకటరత్నం,అధ్యక్షుడిగా పెనుకొండ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా అమనాపల్లి సింగరయ్య కార్యదర్శిగా పట్నాల శివకృష్ణబాబు, మహిళా అధ్యక్షురాలిగా కట్టంగి వీరవెంకటలక్ష్మి, సీతానగరం మండలం అధ్యక్షుడిగా గుడపర్తి సత్యనారాయణ, రాజానగరం అధ్యక్షుడి రావులపూడి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

యూటీఎఫ్ రంగంపేట అధ్యక్షుడిగా రాంబాబు



రంగంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండల స్వర్ణోత్సవ మహాసభ మంగళవారం సాయంత్రం రంగంపేట జడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రూపస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు విజయగౌరి పాల్గొని 50 ఏళ్లుగా సంఘం చేసిన పోరాటాలను వివరించారు. అనంతరం మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండలాధ్యక్షుడిగా కోరమాటి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఐతే విజయ్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ట్రోక్ వస్తే సకాలంలో వైద్యం అందించాలి

దివాన్‌చెరువు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుకోని పరిస్థితుల్లో ఎవరైనా హార్ట్‌స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడితే సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చునని డెల్టా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రావణ్ నాగులకొండ అన్నారు. దివాన్‌చెరువులోని వీజే ఫార్మసీ కళాశాలలో హార్ట్‌స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ నివారణపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయనతోపాటు డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్ట్రోక్ రావడానికి గల కారణాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.నరేంద్ర, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వీవీ జగన్మోహనరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎన్.నిరూప్‌రెడ్డి, డీన్ డాక్టర్ కె.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టపగలే అపార్ట్‌మెంట్లో చోరీ

5 కాసుల బంగారం, ట్యాబ్ అపహరణ

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం దుప్పలపూడిలో మంగళవారం పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ శ్రీనునాయక్ వివరాల ప్రకారం.. గ్రామంలోని మారుతి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న పాలేటి రాజేష్, శ్రీదేవి దంపతులు మంగళవారం ఉదయం ఇంటికి తాళాలు వేసుకుని బయటకెళ్లి సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉంచిన ఐదు కాసుల బంగారు నగలు, ట్యాబ్ పోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి పెంచుకోవాలని బయోకాన్ శాస్త్రవేత్త కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఔషధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై ఆయన విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

కడియం సీఐ వెంకటేశ్వరరావు



కడియంలో బాణసంచా షాపులు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

కడియం, అక్టోబరు 29: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు పెట్టేవారు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, అలానే దుకాణాల వద్ద అగ్నిప్రమాద నివారణ జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ఎ.వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలో వివిధ గ్రామాల్లో బాణసంచా విక్రయ షాపులు ఏర్పాటు చేసే ప్రాంతాలను ఆయన సందర్శించి షాపుల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మహాలక్ష్మి, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడొద్దు: సీఐ సుమంత్

అనపర్తి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రమాదాల బారిన పడొద్దని సీఐ సుమంత్ అన్నారు. మంగళవారం అనపర్తిలో తాత్కాలిక లైసెన్సులు పొంది ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. నీరు, ఇసుక దుకాణానికి చేరువగా ఉంచాలన్నారు. ఇండ్ల మధ్య ఎవరైనా బాణసంచా తయారు చేస్తుంటే వారి సమాచారాన్ని తమకు అందించాలని, వివ రాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రాకపోకలకు ఇబ్బంది లేకుండా

వంతెన నిర్మాణం : ఎమ్మెల్యే నెహ్రూ



వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గోకవరంలోని ఠాణా సెంటర్ సమీపంలో వంతెన నిర్మాణం జరుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఠాణా సెంటర్ సమీపంలో బ్రిటిష్ కాలం నాటి వంతెనను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఠాణా సెంటర్‌లోని వంతెన 1905వ సంవత్సరంలో నిర్మించినదని, ఈ వంతెనతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాతీయ రహదారుల నిబంధనలు ప్రకారం వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. ఎటువంటి మలుపులు లేకుండా వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. అవసరమైతే సీఎం చంద్రబాబు సహకారంతో కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జిని నూతన విధానంతో నిర్మిస్తామన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

'సమాజ సేవలో దశాబ్ద వికాసం' పుస్తకావిష్కరణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు సహాయం చేయడమంటే భగవంతునికి సేవ చేయడమేనని, 11 ఏళ్లుగా 100 మంది వృద్ధులకు ప్రతి నెలా పించన్లు అందజేస్తున్న వికాస్ సంస్థ కృషి అభినందనీయమని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో 'సమాజ సేవలో దశాబ్ద వికాసం' అనే పుస్తకాన్ని జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. వికాస్ సంస్థ వ్యవస్థాపకుడు యార్లగడ్డ ప్రభాకర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

2 నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు

దివాన్‌చెరువు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పాత తుంగపాడులో రామలింగేశ్వరస్వామికి పవిత్ర కార్తీకమాసంలో నిత్యాభిషేకాలు, సాలిగ్రామ దీపదానాలు నవంబరు 2వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయార్చకుడు అయలూరి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కార్తీక సోమవారం నాడు స్వామికి విశేషపూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. సంపత్ నగరంలో నాగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆకాశదీపం ప్రారంభిస్తామని ఆలయార్చకుడు భద్రరావు తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున జ్యోతిర్లింగార్చన జరుగుతుందన్నారు. అలాగే దివాన్‌చెరువు ఆగమాశ్రమంలో విశ్వేశ్వరస్వామికి కార్తీక మాసంలో ప్రత్యేకపూజలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయార్చకుడు సంతోష్ తెలిపారు. రోజూ నిత్యపూజ, నిత్యాభిషేకం జరుగుతుందన్నారు. ప్రతీ సోమవారం ఏకవార రుద్రభిషేకం, సాయంత్రం పల్లకి సేవ జరుగుతాయని చెప్పారు.

పాఠశాల అభివృద్ధికి శ్రీనివాస్ సహకారం

కోరుకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి దళితపేటలో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ 10శాతం కాంట్రిబ్యూషన్ చెక్‌ను ప్రధానోపాధ్యాయురాలు పీవీ సుచరితకు అందజేశారు. విద్యార్థులకు మంచినీటి వాటర్ ట్యాంక్, వాష్‌బేసిన్, వాటర్ ట్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి వాస్ అనే స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. అయితే ఇందుకు పాఠశాల 10శాతం కాంట్రిబ్యూషన్ చెల్లించాలని చెప్పడంతో పాఠశాల తరుపున అడపా శ్రీనివాస్ అందుకు అవసరమైన చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవరావు, బొలేపల్లి రామారావు, గండి విజయ్‌కుమార్, కన్నబత్తుల ఏసు, చినబుజ్జి, ఏసురత్నం, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

నూతన ఆలయాల నిర్మాణానికి

శ్రీవాణి ట్రస్టు చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో పలు ఆలయాలకు రూ.17.73 లక్షలు

కోరుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నూతనంగా నిర్మించే పలు ఆలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.17.73 లక్షలను ఆయా ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చెక్కులు అందజేశారు. దీని ప్రకారం మండలంలోని కణుపూరులో నిర్మిస్తున్న వినాయక ఆలయానికి రూ.5 లక్షలు, సీతానగరంలో సీతారామాంజనేయుల ఆలయానికి రూ.2.60 లక్షలు, నల్లగొండలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.2.33 లక్షలు, రఘుదేవపురంలో కామేశ్వరమ్మ ఆలయానికి రూ.2.80 లక్షలు, రాజానగరంలో కన్యకా పరమేశ్వరి ఆలయానికి రూ.5 లక్షలు చెక్కులు అందజేశారు. ఎండోమెంట్ ఈవో సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు తనకాల నాగేశ్వరరావు, కణుపూరు సర్పంచ్ కరణం రమణ, ముక్కారాంబాబు, బదిరెడ్డి దొర, సుంకర శ్రీనివాసు పాల్గొన్నారు.









మనకూ ఉన్నాయ్.. శివకాశీలు!

- ఉమ్మడి జిల్లాలో బాణసంచా తయారీ
- ప్రతి జిల్లాలోనూ ప్రధాన కేంద్రాలు
- ఏడాదంతా వేలాది మందికి ఉపాధి
- శివకాశీని తలదన్నే ఉత్పత్తులు

బాణసంచా అంటే ప్రతి ఒక్కరి నోటా వినిపించే మాట శివకాశీ.. ఎందుకంటే అక్కడ మందు గుండు సామగ్రి నాణ్యతగా ఉంటుందనేది ప్రతి ఒక్కరి మాట.. నేటికీ శివకాశీ మాట వినిపించకుండా దీపావళి పండుగ జరగదు.. బాణసంచా అంటే శివకాశీ ఒకటే కాదండోయ్.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ అటువంటి ప్రాంతాలు జిల్లాకో పది వరకూ ఉంటాయి.. అవెక్కడో ఉన్నాయనుకుంటున్నారా.. ఒక్కసారి బాణసంచా తయారు చేసే ప్రధాన ప్రాంతాలేంటో తెలుసుకుంటే.. ఇక్కడా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం.. రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం, జువ్విపాడు ఇలా చెప్పుకుంటూ పోతే బాణసంచా తయారీనే ఉపాధిగా మలుచుకున్న గ్రామాలెన్నో ఉన్నాయి. ఒక పక్కన ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా.. దశాబ్దాలుగా వేలాది మందికి అదే ఉపాధి.. అధికారికంగా తయారీ కేంద్రాల లెక్క పదుల సంఖ్యలో ఉంటే.. అనధికారికంగా ఈ లెక్క వందల్లో ఉంటుందనేది అధికారులెరిగిన సత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆనందమైనా.. బాధయినా.. ఉత్సవమైనా.. జాతరైనా.. రాజకీయ మీటింగ్ అయినా చివరికి పుట్టినరోజు అయినా కూడా మందుగుండు సందడి చేయాల్సిందే మరి.. అందుకే ఏడాదంతా మూడు బాంబులు.. ఆరు చిచ్చుబుడ్లుగా ఈ వ్యాపారం సాగుతూనే ఉంటుంది.. రేపు దీపావళి పండుగ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తయారీ కేంద్రాలపై ప్రత్యేక కథనం.. - వివరాలు 10లో





మద్యం అక్రమాలపై డయల్ 70932 73981

కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం/కొవ్వూరు,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. నూతన మద్యం పాలసీ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.మద్యం ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయించడం, బెల్టు షాపులను నిర్వహించడం వంటివి చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. సారాకు సంబంధించి ఇప్పటి వరకూ 25 చోట్ల సోదాలు చేసి 24 మందిపై కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేశామన్నారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 11,800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేశారన్నారు. 23 మందిని అరెస్టు చేసి 43.39 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్టు చెప్పారు. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలో మంగురువారం రాత్రి ఎక్సైజ్ అధికారులు దాడిచేసి 6 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు ఎక్సయిజ్ సీఐ జి. సత్యనారాయణ తెలిపారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో ఒక వ్యక్తిని అరెస్టుచేసి 6 క్వార్టర్ ఆఫీసర్స్ చాయిస్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకసారి కేసు నమోదైన తర్వాత భవిష్యత్తులో పునరావృతమైతే మరింత కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అక్రమాలపై ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 70932 73981కి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

రైసుమిల్లులో సోదాలు

నిడదవోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం సూరాపురం గ్రామంలోని అలివేలు ఆగ్రో రైస్ మిల్లుపై మంగళవారం సాయంత్రం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు చేపట్టారు. రాత్రి వరకు తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై వివరాలు వెల్లడించేందుకు మరింత సమయం పడుతుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీరుగా పుల్లారావు

ఎస్‌ఈగా నరసింహమూర్తి

రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీరుగా ఎస్.పుల్లారావు నియమితులయ్యారు.ధవళేశ్వరం క్వాలిటీ కంట్రోల్ ఆంధ్రా రీజియన్ అండ్ ఏపీఈఆర్ఎల్ సీఈగా కూడా అద నపు బాధ్యతలు నిర్వహిస్తారు. ధవళేశ్వ రంలోని పీఐపీ హెడ్‌వర్క్స్ సర్కిల్ ఎస్‌ఈగా కె.నరసింహమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే వద్దకు వేగేశ్వరపురం పంచాయితీ

తాళ్లపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దాదాపు రెండు దశాబ్దాలుగా రైతు సంఘం పేరుతో వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం నిర్వహణ బాధ్యతలు కొనసాగిస్తున్న కమిటీని రద్దు చేయాలని కోరుతూ ఆయకట్టు పరిధిలోని రైతులు పార్టీలకతీతంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును మంగళవారం కలిశారు. కమిటీ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకర్ల శ్రీనివాస్, గన్నిన సత్తిబాబు,అన్నమరెడ్డి సత్తిబాబు, తైలం పోశారావు, ఉప్పులూరి రమేష్, సూలా పోసియ్య, మద్దుకూరి శంకరం, దుగ్గిరాల జగదీష్,తైలం బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



డబ్బులిచ్చుకో.. దుకాణం పెట్టుకో!

చోటా నేతలు.. పండుగ మామూళ్లు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): దీపావళి వచ్చిందంటే అందరికీ పండుగే. ప్రతి ఏడాది అధికారులకు మరీ పండుగ. ఈ ఏడాది కూటమి చోటా నాయకులు చేరినట్టు సమాచారం.. మామూళ్లు మాకే ఇవ్వండి.. మేం చూసుకుంటాం అంటూ దుకాణదారులకు హుకుం జారీ చేసినట్టు తెలిసింది. దీంతో దీపావళి బాణ సంచా దుకాణాల ఏర్పాటులో కూడా కొంత మంది కూటమి నాయకులు చక్రం తిప్పుతున్నారు.గత ఐదేళ్లగా ఇటువంటి పనులకు దూరంగా ఉన్న చోటా మోటా నాయకులు అధికారంలోకి వచ్చాక వసూళ్లు మొదలేట్టేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజవర్గాల పరిధిలోను ఇదే పరిస్థితి ఉంది. మండల హెడ్ క్వార్టర్స్‌లో బాణసంచా దుకాణాలకు పోలీస్, అగ్నిమాపక శాఖ, స్థానిక సంస్థల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. సాధా రణంగా వ్యాపారులు ఆయా శాఖలకు దరఖాస్తులు చేసుకుని చలానాలు కట్టి అనుమతులు తీసుకుంటారు. అయితే గత ప్రభుత్వం పుణ్యా మా అంటూ అన్ని వ్యవహారాల్లో కొత్త పోకడ ఆరంభమైంది. షాపుల అనుమతులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు డీల్ చేయడం వ్యాపారుల తరపున అనుమతులకు అధికారులను అప్రోచ్ కావడం అలవాటు చేశారు. ఇప్పుడు ఈ సంస్కృతి కూటమి నాయకులకు అంటుకుంది. ఫలితంగా బాణసంచా దుకాణాలకు కూడా కొన్ని నియోజకవర్గాల్లో డబ్బులు భారీగానే వసూలు చేసినట్టు తెలిసింది. దుకాణాన్ని బట్టి మామూలు కట్టేశారు. రూ.10 వేల నుంచి రూ.45 వేల వరకు వ్యాపారుల నుంచి వసూలు చేసినట్టు తెలిసింది. ఇందులో అనుమతులు జారీ చేసే అధికారులకు భాగస్వామ్యం ఉన్నట్టు వినికిడి.దీపావళికి మూడు రోజుల ముందు నుంచి వ్యాపారం చేసేవారు ప్రజల డిమాండ్‌ను బట్టి ధరలు పెంచుతారు. ఈ వ్యాపారం జిల్లాలో కోట్లలో జరుగుతుంది. అందుకే భారీ షాపుల అనుమతులకు డబ్బుకు లెక్కచేయరు. అయితే పరోక్షంగా ఈ భారమంతా వినియోగదారులపై పడుతుంది. జిల్లాలో రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం , అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజవర్గాల్లో కూటమి క్షేత్రస్థాయి నాయకులు బాణ సంచా అనుమతుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పలు నియోజకవర్గాలో క్షేత్రస్థాయిలో వసూళ్లకు పాల్పడిన నాయకులను ఎమ్మెల్యేలు మందలించినట్టు తెలిసింది.

- బాణసంచా దుకాణానికో రేటు
- రూ.10 వేల నుంచి రూ.45 వేలు
- అన్ని చూసుకుంటామని హామీ
- ముందుగానే చెల్లింపులు
- జిల్లాలో 388 షాపులకు అనుమతి
- ఒక్క రాజమండ్రిలోనే 144
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- ధరలపై బాదుడే..బాదుడు

ధరల బాదుడే..

రాజమహేంద్రవరం/పెరవలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా ధరలు పేలుతున్నాయ్.. అన్నీ ధరలు పెరిగినట్టే బాణసంచా ధరలూ పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్టు సమాచారం. బాణసంచాను కాల్చడానికి పిల్లలు, పెద్దలు పోటీ పడుతుంటారు. దీంతో ప్రతి ఏడాది డిమాండ్ ఉంటుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా దుకాణాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో అధికారికంగా 388 దుకాణాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 263, కొవ్వూరు డివిజన్‌లో 125 దుకా ణాలకు అనుమతిచ్చారు. ఒక్క రాజమహేంద్రవరంలోనే 144 దుకాణాలు ఉన్నాయి.ఆయా దుకాణాల్లో ధరలు మాత్రం ఢాం..ఢాం అని పేలు తున్నాయి.ధరలపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారం పెంచి విక్రయాలు చేస్తున్నారు. దీపావళి బాణసంచాలో రూపాయి నుంచి రూ. 20 వేల వరకు మందుగుండు సామగ్రి ఉంది. గురువారమే దీపావళి కావడంతో మంగళవారం కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడాయి. బుధవరం మరింత వ్యాపారం జరిగే అవకాశం ఉంది. గురువారం ఉదయం కొనుగోలు చేస్తారు. ఈ లెక్కన మరో రెండు రోజులు వ్యాపారం ఉంటుంది.

బాణసంచా పవర్ పెరిగింది

నేను 2001 నుంచి రాజానగరం మండలం రాధేయపాలెంలో గొడౌన్ పెట్టి, హోల్‌సేల్ బాణ సంచా వ్యాపారం చేస్తున్నా. ఆరంభంలో బాణ సంచాకు పవర్ తక్కువ ఉండేది. ఇటీవల పవర్ బాగా పెంచారు. ఇవాళ మందులను ఎండ బెట్టనవసరం లేదు. ప్రతి ఏడాది కోట్లలో వ్యాపా రం సాగుతోంది.

- మామిడిపల్లి రామకృష్ణ, వ్యాపారి





పోలీసుల తనికీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి) : బాణసంచా దుకాణాల్లో నిబంధనలపై ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలోని బాణసంచా విక్రయ దుకాణాలు, తయారీ, నిల్వ కేంద్రాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. డీఎస్పీలు రంగంలోకి దిగి అనుమతులు పరిశీలించారు. అగ్నిమాపక ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.



ఆసుపత్రిలో నవీన్‌కుమార్‌ను పరామర్శిస్తున్న పురందేశ్వరి

రైలు నుంచి జారిపడిన యువకుడికి ఎంపీ పరామర్శ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారి పడి తీవ్రగాయాలపాలైన యువకుడికి మెరుగైన చికిత్స అందించాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. విశాఖపట్నం ఆరిలోవకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడి కుమారుడు నవీన్‌కుమార్ ఇటీవల రైలు నుంచి జారిపడి తీవ్రగా యాలపాలయ్యాడు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో తలకు బలమైన దెబ్బ తగలడంతో కాళ్ల చేతులు చచ్చుపడిపోయాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి మంగళవారం ఆ యువకుడిని పరామర్శించారు.మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి సహాయం కోసం ముఖ్యమంత్రికి, ఆరోగ్యశాఖ మంత్రికి లేఖను పంపించారు.

ప్రాణం తీసిన రూ.300

ఇద్దరి మధ్య ఘర్షణ

10

నిరక్షరాస్యులు 5087

రాజానగరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు..ఈ నానుడి అందరికీ సుపరిచితమే. దీనిలో భాగంగానే ఆడ పిల్లలు చదువుకోవాల్సిన ఆవశ్యకత గురించి మన పూర్వీకులు ఎప్పుడో చెప్పారు. ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి పేర్కొన్నారు.జిల్లాలో తొలిసారిగా ఉల్లాస్ మొదటి ఫేజ్ శిక్షణ తరగతులను రాజానగరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహిం చారు. ఆరు మండలాలకు చెందిన ఎంపీ డీవోలు హాజరయ్యారు.పీడీ మాట్లాడుతూ గ్రామీణ పేద రిక నిర్మూలన సంస్థ (సెర్ప్)తో పాటు వయోజన విద్య విభాగం సమన్వయంతో పనిచేస్తాయన్నా రు.చదువులేని మహిళల్లో అక్షరా స్యతపై చైత న్యం పెంపొందించేలా కేంద్ర ప్రభు త్వం ఆధ్వ ర్యంలో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్ర మానికి రూపకల్పన చేసిందన్నారు. మొదటి ఫేజ్ శిక్షణ తరగతులు అనంతరం సెకండ్, థర్డ్ ఫేజ్ శిక్షణ తరగతులను జిల్లా అంతటా నిర్వహించ డం జరుగుతుందన్నారు. జిల్లాలో రాజానగరం, రంగంపేట, బిక్కవోలు,నిడదవోలు, పెరవలి, చాగల్లు మండలాల్లో సుమారు 5,087 మంది నిర క్షరాస్యులైన వయో జనులు ఉన్నట్టుగా గుర్తించా మన్నారు. వీరందరికి ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై 200 గంటల పాటు శిక్షణ ఇచ్చి మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందన్నారు. వీరికి విద్యనేర్పించేందుకు వలంటీర్లుగా ఇంటర్ ఫైబడిన చదివిన వారిని నియమిస్తామన్నారు. వీరికి నవంబరు నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు.

- ఆరు మండలాల్లో ఇదీ లెక్క
- మహిళా అక్షరాస్యతపై దృష్టి
- 'ఉల్లాస్'కు కూటమి శ్రీకారం
- ఐదు విభాగాలపై అవగాహన
- రాజానగరంలో తొలి శిక్షణ
- ఆరుగురు ఎంపీడీవోల హాజరు
- త్వరలో తరగతులు ఆరంభం

అమలు ఇలా...

జాతీయ విద్యా విధానం 2020 పాలసీకి అనుగుణంగా అమలు చేస్తున్నారు. ఐదు విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ప్రతి గ్రామం నుంచి నిరక్ష్యరాస్యులైన మహిళలు అక్షరాలు నేర్చుకోవడం, సంతకాలు చేయడం, మొబైల్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ అక్షరాస్యతపై తర్ఫీదు ఇస్తారు. గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలను అక్షరాస్యత కేంద్రాలుగా తీర్చిదిద్దుతారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు పసుపులేటి పోశయ్య, రాష్ట్ర స్థాయి రీసోర్స్ పర్సన్లు రవీంద్రబాబు, బండారు రామకృష్ణ, ఆయా మండలాల సెర్ప్ ఏపీఎంలు గుమ్మడి సునీత,సీసీలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ ఇతర అధికారులు

అస్సాగో సమస్య తీరుస్తాం

గుమ్మళ్లదొడ్డి ప్రజలకు కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ హామీ

గోకవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి ఎదురయ్యే ఇబ్బందులను అరికడతా మని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. గుమ్మళ్లదొడ్డి గ్రామాన్ని మంగళవారం కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. అనంతరం గ్రామంలోని రామాలయం వద్ద కమిటీ సభ్యుల సమక్షంలో స్థానికులతో చర్చించారు. పరిశ్రమ నుంచి వాసనలు హానికరమైనవి కావని యాజమాన్యం వివరిస్తున్న విషయాన్ని బాధితులు వారు దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళల్లో కంపెనీ నుంచి వచ్చే శబ్దాలకు నిద్ర పట్టడం లేదని, నల్లటి మసి లాంటి బూడిద తమ నివాస గృహలపై పడుతుందని పలువురు కలెక్టర్‌కు తెలిపారు. గ్రామస్థులు చెప్పినదంతా విన్న కలెక్టర్ మరోమారు గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటానన్నారు. వారి వెంట ఆర్డీవో కృష్ణనాయక్,కోరుకొండ సీఐ సత్యకిషోర్, తహశీల్దార్ సాయి ప్రసాద్, కాలుష్య నివారణ మండలి సభ్యులు ఉన్నారు.

రాజకీయం చేయవద్దు : జ్యోతుల

అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి తన నియోజకవర్గంలోని ప్రజలను ఎలా పరిరక్షించుకోవాలో తనకు తెలుసని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గాజింగం సత్తిబాబు నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ వివాదాన్ని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కమిటీ వేసి చర్యలు తీసుకుంటామన్నారు. కొంత మంది నాయకులు రాజకీయ స్వలాభం కోసం దీక్షలకు దిగడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇథనాల్ పరిశ్రమ నుంచి స్థానికులకు ఎటువంటి సమస్య ఎదురవ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.మల్లిసాల గ్రామంలో 225 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌కు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగబోతుందన్నారు.

జీజీహెచ్‌లో దళారులను అరికట్టాలి

సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల సంఘం వినతి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సరాకుల సుధాకర్, కందుకూరి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో దళారుల బెడద తీవ్రంగా ఉందని, సదరం ఇతర సేవల పేరుతో రోగులను మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారన్నారు. ఇలాంటి వారిని సిబ్బంది ప్రశ్నిస్తే వారిపై దళారులు దాడులకు దిగుతున్నారని, దుర్భాషలాడుతున్నారన్నారు. మరికొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఆసుపత్రిలోని ఎమర్జన్సీ ఓపీ కౌంటర్‌లో రాత్రి వేళ పనిచేసే సిబ్బందికి అల్లరి మూకల కారణంగా రక్షణ లేకుండా పోతున్నదన్నారు. ఆసుపత్రి పోలీస్ అవుట్‌పోస్టులో సమర్థులైన సిబ్బందిని నియమించేలా పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించాలని కోరారు. వీటిపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు.



సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల వినతి

సూపరింటెండెంట్‌ను కలసిన వారిలో ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, మణికంఠ, రమణ తదితరులున్నారు.



గోదావరి పుష్కరాలకు సమాయత్తం కండి

2027లో నిర్వహణ ఏర్పాట్లపై తొలి సమీక్ష

10

మనకూ ఉన్నాయ్.. శివకాశీలు..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని పలు గ్రామాలు బాణసంచా తయారీలో ప్రసిద్ధి చెందాయి. అందులో ప్రధానమైనవి బిక్కవోలు మండలం కొమరిపాలెం, సామర్లకోట మండలం వేట్లపాలెం, రామచంద్రపురం మండలం ద్రాక్షారామ, జువ్విపాడు.. ఇలా పది గ్రామాల వరకు బాణసంచా తయారీ జరుగుతుంది. దాదాపు ఐదు దశాబ్దాల నుంచి ఇదే పరిశ్రమలో కొనసాగుతున్నవారు ఉన్నారు. వందలాది మంది కార్మికులు జీవనో పాధి పొందుతున్నారు. కొమరిపాలెం గ్రామంలో 1932లో వెలుగుబంట్ల వీరన్న బాణసంచా తయారీ ప్రారంభించగా, ఆయన కుమారులు సత్యనారాయణమూర్తి, రామకృష్ణలు వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రస్తుతం శ్రీగణపతి ఫైర్ వర్క్స్ పేరిట వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి తన కుమారుడు చిట్టిబాబుతో కలసి బాణసంచా తయారీ పరిశ్రమను కొనసాగిస్తున్నారు. ఇక్కడ శివకాశీ మాదిరిగా డిస్కో చిచ్చుబుడ్లు, టపాసులు, మతాబులు, బేబీ కాండెల్స్ పెన్సిళ్లు, తాళ్లు, పేల్చు జువ్వలు, బ్యాటరీ బాక్సు లు, బొట్లు, సెర్చిలైట్లు, రాకెట్లు తయారు చేస్తారు. చాగల్లు మండలం మీనా నగ రంలో కూడా మూడు తరాలు నుంచి ఇదే వృత్తిలో ఉన్న వారున్నారు. రాజమహేంద్రవరం, మీనానగరం, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నాయి. ద్రాక్షారామ కేంద్రంగా పెద్దిరెడ్డి వంశీకులు మూడు తరాలుగా బా ణసంచా తయారీలో కొనసాగుతున్నారు. 1940లో మద్రాస్ లైసెన్సు తో పెద్దిరెడ్డి సుబ్బారావు మందుగుండు తయారీ ప్రారంభించారు. తదుపరి ఆయన కుమారులు పెద్దిరెడ్డి వీర్రాజు కాకినాడలో, పెద్దిరెడ్డి రాంబాబు, సూరిబాబులు ద్రాక్షారామలో బాణసంచా తయారీ చేపట్టారు.ద్రాక్షారామలో పెద్దిరెడ్డి సూరిబాబు అంజనేయ ఫైర్‌వర్క్స్ స్థాపించి బాణసంచా తయారీలో పేరు సొంతం చేసుకున్నా రు.బాణసంచా తయారీలో రెండో శివకాశీగా పేరొందిన గ్రామం వేట్లపాలెం.ఇది సామర్లకోట మండలంలో ఉంది. ఇదే మండలంలో హుస్సేను పురం, జి.మేడపాడు గ్రామాల్లో బాణసంచా తయారవుతోంది. మందుగుండు సామగ్రి తయా రీలో మండపేట కూడా ప్రసిద్ధి. ఇక్కడ తయా రయ్యే బాణసంచా రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతులు జరిగేవి.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు శ్రీరామా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం విక్రయించుకోవడానికి ఇబ్బందులు పడకూడదని అన్నిచర్యలు చేపట్టిందన్నారు. రైతులు ధాన్యం విక్రయించుకోవడంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి కొన్ని గంటలలోనే రైతుల ఖాతాకు ప్రభుత్వం సొమ్ము జమ చేస్తున్నారని రైతులు తెలపడంతో ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, దాయన రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, మట్టే ప్రసా ద్, గంగ్రోతు పవన్, కె.సాంబయ్య, బొబ్బిలి పేర్రాజు, వ్యవసాయశాఖ ఏడి పి.చంద్రశేఖర్, మండల ఏవో ఎం గంగాదర్, సిఎస్. ఎం.సునీత, సొసైటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ, కరుటూరి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

చాగల్లు, అక్టోబరు 29 : చాగల్లు మండలం మార్కొండపాడులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బ్రాహ్మణగూడెం రైతుల భూమి నిడదవోలు రెవెన్యూ పరిధిలో ఉందని కనుక స్థానికంగా ధాన్యం అమ్మకాలు చేసుకొనే విధంగా అవకా శం కల్పించాలని కోరారు. ఎడ్లబండ్లపైన ధాన్యం రైస్‌మిల్లుకు రవాణా చేసే విధంగా అవకాశం కల్పించాని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రశేఖర్, తహశీల్దార్ ఎం.మేరికమ్మ, రైస్‌మిల్లర్లు అసోసియేషన్ నాయకులు గారపాటి బాబురావు, సుంకవల్లి రమేష్, కూటమి నాయకులు బొడ్డు రాజు, మద్దిపాటి వీరరాఘవులు, కోడూరి కాశిగంగాధరరావు, ఉప్పులూరి చిరంజీవి పాల్గొన్నారు.

కొవ్వూరు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా వీర్రాజు

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా మేడూరి వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొవ్వూరు పట్టణంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో మంగళవారం పట్టణ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పట్టణ నూతన అధ్యక్షుడిగా మేడూరి వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా పొన్నాడ సూరిబాబు, కమ్యూనిటీ హాలు అధ్యక్షుడిగా బొండపల్లి నరసరావు, ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తుమ్మలపల్లి అంజిబాబు, చింతలపూడి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా కోడూరి రాము, గౌరవ సలహాదారులుగా తాటిపూడి సూర్యారావు, పట్నాల రామరావు, కోడూరు అప్పారావు ఎంపికయ్యారు. అధ్యక్షుడు మేడూరి వీర్రాజు మాట్లాడుతూ కార్తీకమాస వనసమారాదన నవంబరు 26న నిర్వహించడానికి సంఘం తీర్మానించిందన్నారు.

పశువుల్లో వచ్చే వ్యాధులపై అవగాహన ఉండాలి

పెరవలి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పశువులలో వివిధ రకాల వ్యాధులు వాటి నివారణపై రైతులు అవగాహన ఉండాలని ఉప సంచాలకుడు డాక్టర్ సత్యనారాయణ అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణన సంస్థ, జిల్లా పశు శాఖాభివృద్ధి సంస్థ పెంటపాడు వారి ఆధ్వర్యంలో ఖండవల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం, గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. సర్పంచ్ పులిదిండి నాగరాము, ఉపసర్పంచ్ అతికాల వెంకటరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ జి.ఏసురత్నం, డాక్టర్ వి.రుషిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రూ.300

పెరవలి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్సాల నాగరాజు అనే వ్యక్తి భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ తల్లితో కొత్తపల్లి అగ్రహారంలో నివసిస్తున్నాడు. ఈనెల 27న మధ్యాహ్నం అతని ఇంటి వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన ఏలూరి ప్రసాద్ అనే వ్యక్తి నాగరాజు ఇంటికి వచ్చి అతని జేబులో నుంచి రూ.300 తీసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయమై అదే గ్రామంలోని పంచాయతీ చెరువు వద్దకు వెళ్లి డబ్బులు విషయమై ఘర్షణ పడ్డారు. దీంతో ప్రసాద్ నాగరాజు పొత్తికడుపుపై తన్నగా అతనికి దెబ్బలు తగిలి కింద పడిపోయాడు. దీంతో స్థానిక ఆర్ఎంపీ డాక్టర్‌తో ప్రథమ చికిత్స చేయించారు ఈనెల 28న సాయంత్రం 5గంటలకు చనిపోయాడు. దీంతో మృతుని తల్లి వరసాల దానమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిడదవోలు సీఐ తిలక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 దుకాణాలకు అనుమతి

గోపాలపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురం 3, కరిచర్లగూడెం 1, కొవ్వూరుపాడు 1, దొండపూడి 1, రాజంపాలెం 1, చిట్యాల 1, బాణసంచా దుకాణాలు విక్రయాలకు అనుమతులు ఇచ్చినట్టు తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి తెలిపారు.

వేమన శతకాలను డిజిటలైజేషన్ చేస్తున్నాం

● ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ మోహన్

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేమన శతకాలను డిజిటలైజేషన్ చేసి భావితరాలకు అందించనున్నట్టు ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ భల్లేపల్లి మోహన్ అన్నారు. మంగళవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను రాజమహేంద్రవరంలో కలిశారు. తిరిగివెళ్తూ కొవ్వూరుకు చెందిన మానాశ్రీ ఇంటికి విచ్చేశారు. ఈ సందర్భంగా మరచిపోతున్న వేమన శతకాలను తిరిగి భావితరాలకు అందజేయాలనే సంకల్పంతో 5000 వేమన శతకాలను పాటల రూపంలో అందించనున్నామన్నారు. ఇప్పటివరకు 50 సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. సిని గేయ రచయిత మానాశ్రీ మాట్లాడుతూ మోహన్‌తో కలసి ఇప్పటి వరకు 24 ఆల్బమ్‌లలో పనిచేశానన్నారు.

ఎంపీకి ద్వారబంధాల చంద్రయ్య పుస్తకం అందజేత

దేవరపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని రాజమహేంద్రవరం క్యాంపు కార్యాలయంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ డీ.సువర్ణరాజు మంగళవారం కలిసి స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవ నాయకుడు ద్వారబంధాల చంద్రయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎంపీకి అందజేశారు. డీ.సువర్ణరాజు మాట్లాడుతూ ద్వారబంధాల చంద్రయ్య విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ప్రధా నంగా రంపచోడవరం, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆయన పోరాట స్ఫూర్తికి గుర్తుగా విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ ద్వారబంధాల చంద్రయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషిచేస్తానని తెలిపారు.

మెప్మా కార్యకర్తలకు అవగాహన సదస్సు

నిడదవోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పట్టణ ఎస్ఐ పి.శోభన్‌కుమార్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా కార్యకర్తలకు సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.శోభన్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించుకుని ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. మెప్మా కార్యకర్తలు ప్రజలలో సైబర్ నేరాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

నల్లజర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ భవన్‌కు సీఎం చంద్రబాబు రూ.10 కోట్లు కేటాయించడం హర్షనీయమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్రాధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. మంగళవారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.క్రైస్తవుల సమాధులకు స్థలాలు కేటాయించాలని రాష్ట్రంలోని కలెక్టర్లను సీఎం ఆదేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ విక్టర్, బాబులూక్, యేసురాజు పాల్గొన్నారు.

పుష్కరాలకు సన్నద్ధమవుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

» 2027 అఖండ గోదావరి పుష్కరాలపై సమీక్ష
» గత అనుభవాలే పాఠాలుగా ప్లానింగ్
» జిల్లాను యూనిట్‌గా తీసుకుని సమగ్ర ప్రణాళిక
» అంతర్గత రహదారుల విస్తరణ, ఘాట్ల అభివృద్ధి
» సీతానగరం వైపు వీఐపీ ఘాట్ల నిర్మాణ యోచన
» తొలి సమన్వయ సమావేశంలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గత అనుభవాలనే పాఠాలుగా చేసుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా 2027 అఖండ గోదావరి పుష్కరాలను నిర్వహిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక ,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం 2027 అఖండ గోదావరి పుష్కరాల సమన్వయ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అఖండ గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. అఖండ గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని సమర్థవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళదామన్నారు. సుమారు 8కోట్ల మంది భక్తులు అఖండ గోదావరి పుష్కరాలకు వస్తారనే అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అఖండ గోదావరిలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యం వస్తుందనే విషయం భక్తులకు తెలియజేయాలన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ అఖండ గోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు తదితర మౌలిక వసతులు, నూతనంగా మరికొన్ని ఘాట్లకు ప్రతిపాదనలు, టెంపులు టూరిజంపై దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పుష్కరాలకు సంబంధించి వీఐపీ ఘాట్లను సీతానగరం వైపు నిర్మించాలన్నారు. గోదావరి వ్యూ అద్భుతంగా ఉండే ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. కడియం నర్సరీ ప్రాంతాల్లో అతిథి గృహాలు, మౌలిక సదుపాయాలు, సమగ్రప్రాతిపదికన అభివృద్ధికి ప్రతిపాదన చేయాలన్నారు. రహదారుల విస్తరణ పనులు జరగాలని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 26 స్నానాల రేవులు ఉన్నాయన్నారు. విజ్జేశ్వరం నుంచి పట్టిసీమ వరకు 13 ఘాట్లు ఉన్నట్టు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల పేరు చెబితే సీతానగరం మండలంలో గుర్తుకొచ్చేది మునికూడలి ఘాట్ అన్నారు. దానికి గతంలో చంద్రబాబు దేవాన్ష్ ఘాట్‌గా నామకరణం చేశారని గుర్తుచేశారు. ఈ రేవును ఆధునీకరించాలన్నారు. సీతానగరంలో 8 రేవులు ఉన్నట్టు తెలిపారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ మాట్లాడుతూ అఖండ గోదావరి పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తుల రద్దీకి తగ్గట్టుగా విడివిడిగా మార్గాలు ప్రతిపాదిస్తున్నామన్నారు. భక్తుల వసతి కోసం శాటిలైట్ సిటీ, బస్టాండ్ పార్కింగ్ స్థలం గుర్తించాం, సీసీ కెమెరాలు, ప్రవేశ నిర్గమ ద్వారాలు, లోకల్ ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై ఆయా శాఖలతో చర్చలు జరుపుతామన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ తొలుత పుష్కరాలపై ఏవి ప్రదర్శన చేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తన డివిజన్ పరిధిలోని కొవ్వూరు నుంచి నిడదవోలు వరకు గోదావరి రేవుల పరిస్థితిని వివరించారు. గతంలో పార్కింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో ఇప్పుడు రైతులు ముందుకు రావడంలేదన్నారు. అయినా వారితో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. లక్ష్మీనగర్ లేవుట్‌లో ఉన్న స్థలాన్ని పార్కింగ్‌కు వినియోగించవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ సీతానగరం నుంచి కడియం వరకు ఉన్న రేవుల పరిస్థితిని వివరించారు. నూతన రేవుల నిర్మాణాలకు అనుగుణంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. టూరిజం రీజనల్ డైరెక్టర్ స్వామినాయుడు మాట్లాడుతూ టూరిజం పరంగా ప్రణాళికతో ముందుకు వస్తామన్నారు. రెండో సమావేశం నాటికి తాము మరిన్ని ప్రణాళికలతో వస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీలు దేవ కుమార్, భవ్య కిషోర్, ఆర్ఎంసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

దేవరపల్లి/కొవ్వూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలంలో పలు చోట్ల దాడులు నిర్వహించి ఇద్దర్ని అరెస్టు చేసి 36మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద విక్రయిస్తున్న 16 మద్యం సీసాలను ఒక వ్యక్తిని అరెస్టు చేయగా దుద్దుకూరు గ్రామంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కొవ్వూరులోని రాజీవ్‌కాలనీలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతడి నుంచి బీర్లు 2, క్వార్టర్ బాటిల్స్ 9 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. అలాగే కొవ్వూరు మండలం దొమ్మేరులో ఎస్ఐ కె.జగన్మోహనరావు దాడిచేసి ఒక మహిళను అరెస్టు చేసి 10 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

టీడీపీ జీవితకాల సభ్యత్వం తీసుకున్న బూరుగుపల్లి

ఉండ్రాజవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మంగళవారం రూ.లక్ష చెల్లించి జీవితకాలపు టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభ్యత్వాలను పొందాలన్నారు. నియోజవర్గంలో ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని నాయకులను కోరారు.